## గోశాల నిర్మాణము

1. రూ. 20,000-00 శ్రీ కె. నాగభూషణ ఆచారి గారు, విశాఖపట్నం, కీ॥శే॥ దుద్దుపూడి సాంబమూర్తి గారి జ్ఞాపకార్థము
2. రూ. 5,051-00 శ్రీమతి కుసుమంచి శోభారాణి గారు & స్నేహితులు, తుని.
3. రూ. 10,000-00 శ్రీమతి యాళ్ళ సత్యవాణి గారు, యానాం.
4. రూ. 10,000-00 శ్రీ నూకల బాబూరావు గారు, శ్రీ శాంతి ఆశ్రమం
5. రూ. 25,000-00 శ్రీమతి యండమూరి అంబికా దేవి గారు, కాకినాడ
6. రూ. 10,000-00 శ్రీమతి ఆరుమళ్ళ కోటేశ్వరమ్మ గారు, W/o. కీ॥శే॥ వేంకటేశ్వరరావు గారు శ్రీ శాంతి ఆశ్రమం
7. రూ. 25,000-00 శ్రీమతి దాట్ల బంగారమ్మ గారు, శ్రీ శాంతి ఆశ్రమం

## శరన్నవరాత్రులు

పూజ్యశ్రీ ఓంకార స్వామి వారి ఆశీస్సులచే, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి ఆధ్వర్యములో మాతృ ఆశ్రమం ప్రార్థనా మందిరములో తేది **21-09-2017** నుండి **30-09-2017** వరకు శరన్నవరాత్రులు శ్రీ గంగరాజు మాష్టారు గారిచే నిర్వహించబడును.

### కార్యక్రమము

| | |
|---|---|
| తేది 21-09-2017 నుండి 30-09-2017 వరకు సా॥ 6 గం॥లకు | శ్రీ లలితా సహస్రనామ పారాయణం |
| తేది 21-09-2017 నుండి 23-09-2017 వరకు ఉ॥ 7.30 గం॥లకు | శ్రీ దుర్గా అష్టోత్తర శతనామార్చన |
| తేది 24-09-2017 నుండి 26-09-2017 వరకు ఉ॥ 7.30 గం॥లకు | శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన |
| తేది 27-09-2017 నుండి 29-09-2017 వరకు ఉ॥ 7.30 గం॥లకు | శ్రీ సరస్వతి అష్టోత్తర శతనామార్చన |
| తేది 28-09-2017 సా॥ 6 గం॥లకు | కన్యపూజ |
| తేది 29-09-2017 సా॥ 6 గం॥లకు | మాతృపూజ |
| తేది 30-09-2017 ఉ॥ 7.30 గం॥లకు | విజయదశమి సందర్భముగా శ్రీదేవి అష్టోత్తర శతనామార్చన, సా॥ 6 గం॥లకు శమీ పూజ ● |



ॐ

# శాంతి

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

స్థాపకులు : పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్‌జీ మహరాజ్

గౌరవ సంపాదకులు : స్వామిని వినమ్రానంద

సంపుటి : 93 సెప్టెంబరు - 2017 సంచిక : 9

## విషయసూచిక

పేజి నెం.

| | | |
|---|---|---|
| 1. | ప్రార్థన - అప్పయ్య దీక్షితులు | 02 |
| 2. | ధ్యానము - శ్రీ త్రిపుర సుందరీ వేద పాదస్తవః | 07 |
| 3. | ధ్యానము - స్వామి ఓంకార్, అనువాదం : స్వామి తత్త్వవిదానంద | 09 |
| 4. | ప్రణవము - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు | 13 |
| 5. | శ్రీ దేవీ బీజాక్షర మహిమ - శ్రీమతి వాడ్రేవు శారద | 16 |
| 6. | శ్రీ దేవీ పురాణం - డా॥ కె. వెంకట శివయ్య | 19 |
| 7. | కైవల్యోపనిషత్తు - స్వామిని శృతానంద | 21 |
| 8. | శ్రీరామగీత - వినతి | 24 |
| 9. | అహల్యాబాయి - సిలువేరు సుదర్శన్ | 27 |
| 10. | గోశాల పునర్నిర్మాణము | 29 |
| 11. | విరాళాలు | 30 |
| 12. | శరన్నవరాత్రులు | 32 |

☛ ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి - రచయితలే బాధ్యులు కాని, సంపాదకులు కారు. **- ఎడిటర్**

*జీవిత సభ్యత్వం (12 సం॥) : రూ. 1000/-* *సాలుసరి చందా : రూ. 100/-*

# ప్రార్థన

**(అప్పయ్య దీక్షిత విరచిత దుర్గాచంద్ర కళాస్తుతి)**

**భగవంతుడు నీ ప్రార్థన వినును,**
**చీమ చిటుక్కుమన్నను వినును.**

**శ్లో.1** **వేధో హరీశ్వరస్తుత్యాం విహర్త్రీం విన్ధ్యభూధరే ।**
**హరప్రాణేశ్వరీం వన్దే హన్త్రీం విబుధ విద్విషామ్ ॥**

తా॥ విన్ధ్య పర్వత ప్రాంతమందు విహరించుచు, బ్రహ్మ, విష్ణు, రుద్రులచే పూజింపబడుచు, సత్పురుషులైన పండితుల నాశీర్వదించుచు, శత్రుగణములను సంహరించు, శివుని అర్ధాంగియైన యా పార్వతీదేవికి మ్రొక్కుచున్నాను.

**శ్లో.2** **అభ్యర్థనేన సరసీరూహ సంభవస్య త్యక్తోదితా భగవదక్షిపిధానలీలామ్ ।**
**విశ్వేశ్వరీ విపదపాగమనే పురస్తాన్మాతా మామస్తు మధుకైటభయో ర్నిహన్త్రీ ॥**

తా॥ పద్మోద్భవుడైన బ్రహ్మదేవుని ప్రార్థన నాలకించి, తన లీలతో విష్ణుదేవుని రెప్పలు మూతపడకుండ చేసి, మధుకైటభులను రాక్షసులను సంహకరించిన దివ్యయైన జగన్మాత నా ముందుకు వచ్చి నన్ను కష్టముల నుండి రక్షించుగాక !

**శ్లో.3** **ప్రాజ్ఞిర్జరషు నిహితైర్నిజ శక్తిలేశైః**
**ఏకీభవద్భి రుదితాఽఖిల లోకగుప్త్యై ।**
**సంపన్నశస్త్రనికరా చ తదాయుధస్తై ర్మాతా**
**మమాస్తు మహిషాన్తకరీ పురస్తాత్ ॥**

తా॥ విశ్వరక్షణార్థము సకల దేవతామూర్తులకు తాను ముందు ప్రసాదించిన వివిధ అస్త్ర శక్తులను తిరిగి తాను గ్రహించి ఏకీకృత శక్తిగా నుద్భవించి మహిషాసుర సంహార మొనర్చిన ఆ జగన్మాత నా యెదుట ప్రత్యక్షమగుగాక !

**శ్లో.4** **ప్రోలేయశైల తనయా తనుకాన్తి సంపత్**
**కోశోదితా కువలయచ్ఛవి చారుదేహా ।**



**నారాయణీ నమదభీప్సిత కల్పవల్లీ**
**సుప్రీతి మావహతు శుంభ నిశుంభ హన్త్రీ ॥**

తా॥ హిమవంతుని పుత్రికయైన పార్వతీదేవి కువలయ కాంతియుతమైన దేహము నుండి ఉద్భవించి, భక్తుల సకల అభీష్టములను ఈడేర్చి, శుంభ నిశుంభాసురులను సంహరించిన యా నారాయణీదేవి నాకు సుఖసంతోషములను ప్రసాదించుగాక !

**శ్లో.5** **విశ్వేశ్వరీతి మహిషాంత కరీతి యస్యాః**
**నారాయణీ త్యపి చ నామభిరఙ్కితాని ।**
**సూక్తాని పంఙ్కజభువా చ సురర్షిభిశ్చ దృష్టాని**
**పావకముఖైశ్చ శివాం భజే తామ్ ॥**

తా॥ విశ్వేశ్వరీ ! మహిషాంతకరీ, నారాయణీయను దేవతా నామములతో కూడిన మంత్రముల (సూక్తమాల)తో జగన్మాతను బ్రహ్మ, యతీశ్వరులు, అగ్నిదేవుడు స్తుతించిరి. అట్టి యా పరదేవతను నేను ప్రార్థింతును.

**శ్లో.6** **ఉత్పత్తిదైత్యహనన స్తవనాత్మకాని సరంక్షకా ణ్యఖిల**
**భూతహితాయ యస్యాః ।**
**సుక్తా న్యశేష నిగమాంతవిదః పఠన్తి తాం**
**విశ్వమాతర మజస్రా మభీష్టవీమ్ ॥**

తా॥ ఆ తల్లి ఉత్పత్తిని వేద సూక్తములు వర్ణించుచున్నవి. ఆమె అసుర సంహార వృత్తాంతములను దేవతలు కీర్తించి, అసురులు వారియెడ నొనరించిన దుష్కృత్యముల నుండి రక్షణను పొందిరి. ఆమెను వేదాంత విషయపారంగతులైన పండితులు **సకల జన సంక్షేమమునకై సూక్తములతో కీర్తించిరి. అట్టి యా జగన్మాతను నేను నిరతము పొగడుచుందును.**

**శ్లో.7** **యే వైప్రచిత్త పునరుత్థిత శుమ్భముఖ్యైః**
**దుర్భిక్ష ఘోర సమయేన చ కారితాసు ।**
**ఆవిష్కృతా స్త్రిజగతార్తిషు రూపభేదాః**
**తైరంబికా సమభిరక్షతు మాం విపద్భ్యః ॥**

తా॥ వివిధ రూపములను దాల్చి వైప్రచిత్తులు, శుంభుడు మొదలైన రాక్షసులు సృష్టించిన ఉగ్ర కార్యకలాపములు, కరువు కాటకములు మున్నగు ఘోర విపత్తుల నుండి జగముల కాపాడిన ఆ జగన్మాత నన్ను ప్రమాదముల నుండి కాపాడుగాక !

**శ్లో.8 సూక్తం యదీయ మరవిన్ద భవాది దృష్టమ్**
**ఆవర్త్య దేవ్యనుపదం సురథస్సమాధిః ।**
**ద్వావప్యవాపతు రభీష్ట మనన్యలభ్యం**
**తా మాదిదేవతరుణీం ప్రణమామి దేవీమ్ ॥**

తా॥ బ్రహ్మ, ఇతర దేవతలు నిరంతరము శక్తియుతములైన మంత్రములతో కీర్తించి, సురతయను రాజునకు, సమాధియను వైశ్యునకు అనితరసాధ్యములైన వారివారి యభీష్టముల నొనగూర్చిన శివుని పట్టపు రాణియైన ఆ జగన్మాతకు నా వందనములు సమర్పించెదను.

**శ్లో.9 మాహిష్మతీ తనుభవఞ్చ రురుఞ్చ హంతు**
**ఆవిష్కృతైర్నిజ రసాదవతార ఖేదైః ।**
**అష్టాదశాహత నవాహతకోటి సంఖ్యైః**
**అంబా సదా సమభిరక్షతు మాం విపద్భ్యః ॥**

తా॥ మహిషాసురుడను రాక్షసుని పదునెనిమిది కోట్ల స్త్రీ సేనలతోను, రురుడను రాక్షసుని మరియొక తొమ్మిదికోట్ల స్త్రీ సేనలతోను ఉద్భవించి సంహరించిన ఆ జగన్మాత నన్నెల్లప్పుడు ఆపదల నుండి రక్షించుగాక !

**శ్లో.10 ఏతచ్చరిత్ర మఖిలం లిఖితం హి యస్యాః**
**సంపూజితం సదన ఏవ నివేశితం వా ।**
**దుర్గఞ్చ తారయతి దుస్తరమప్యశేషం శ్రేయః**
**ప్రయచ్ఛతి చ సర్వమూమాం భజే తామ్ ॥**

తా॥ ఏ దేవి చరితమును లిఖించినను, చరిత గ్రంథమును పూజించి దానిని ఇంటిలో నుంచికొనినను అత్యంత క్లిష్ట పరిస్థితులు తొలగి, సకలైశ్వర్యములను సిద్ధింపచేయునో అట్టి జగన్మాతను పూజింతును.

**శ్లో.11 యత్పూజనస్తుతి నమస్కృతిభి ర్భవన్తి ప్రీతాః**
**పతామహరమేశ హరాస్త్రయోఽపి ।**
**తేషామపి స్వకగుణై ర్దదతీం వపూంషి**
**తామీశ్వరస్య తరుణీం శరణం ప్రపద్యే ॥**

తా॥ ఏ దేవిని పూజించినను, ఆమె పొగడ్తను కీర్తించినను, ఆమెకు నమస్కరించినను, బ్రహ్మ విష్ణు రుద్రులు సంతోషులగుదురో, ఆ దేవతలకు (బ్రహ్మ విష్ణు హరులకు) స్వకీయ గుణములైన సత్త్వరజస్తమో గుణరూపములను ప్రసాదించినదో, అట్టి జగన్మాతను శరణుజొచ్చెదను.



**శ్లో.12 కాంతారమధ్య దృఢలగ్న తయాఽవసన్నాః**
**మగ్నాశ్చ వారిధిజలే రిపుభిశ్చ రుద్ధాః ।**
**యస్యాః ప్రపద్య చరణౌ విపదస్తరన్తి**
**సా మే సదాఽస్తు హృది సర్వజగ త్సవిత్రీ ॥**

తా॥ అరణ్య మధ్యములో చిక్కుకొనిన వారిని, సముద్ర మధ్యములో మునిగిపోయిన వారిని, శత్రువులచే ఎదుర్కొనబడిన వారిని ఏ జగన్మాత పాదపద్మములు రక్షించుచున్నవో అట్టి మాత నా మనస్సులో నుండుగాక !

**శ్లో.13 బంధే వధే మహతి మృత్యుభయే ప్రసక్తే**
**విత్తక్షయే చ వివిధే చ మహోపతాపే ।**
**యత్పాదపూజన మిహ ప్రతికారమాహుః**
**సా మే సమస్త జననీ శరణం భవానీ ॥**

తా॥ కారాగారములో బంధింపబడిన వారిని, మృత్యువు వలని భయమొందిన వారిని, సమస్తైశ్వర్యమును కోల్పోయినవారిని, అనేక ఆపదలందు చిక్కుకొనిన వారిని ఏ తల్లి పాదములు రక్షించుచున్నవో అట్టి భవానిని శరణుజొచ్చుచున్నాను.

**శ్లో.14 బాణాసురప్రహిత పన్నగబంధమోక్షః**
**తద్బాహుదర్పదళనా దుషయా చ యోగః ।**
**ప్రాద్యుమ్నినా దృతమలభ్యత మత్రప్రసాదాత్**
**సా మే శివా సకల మప్యశుభం క్షిణోతు ॥**

తా॥ ఏ తల్లి సకల శుభములకు ప్రతిరూపమై భాసించుచున్నదో, ఏ తల్లి దయ వలన ప్రద్యుమ్నుని కుమారుడైన అనిరుద్ధుడు బాణాసురబద్ధ నాగపాశ బంధ విముక్తుడై, (తన ప్రియురాలైన) ఉషాకన్యతో చేర్చబడినాడో అట్టి తల్లి శీఘ్రముగ నా అశుభములను తొలగించు గాక !

**శ్లో.15 పాపః పులస్త్యతనయః పునరుత్థితో మామ్**
**అద్యాఽపి హర్తుమయమాగత ఇత్యుదితమ్ ।**
**యత్సేవనేన భయమిందిరయాఽవధూతం**
**తా మాదిదేవతరుణీం శరణం గతోఽస్మి ॥**

తా॥ శివుని పట్టపురాణియైన పార్వతీదేవిని పూజించి, రుక్మిణీదేవి తాను రావణునిచే పూర్వజన్మములోవలె అపహరింపబడుదునేమోయను భయము నుండి విముక్తిని పొందినది. అట్టి పార్వతీదేవిని శరణుజొచ్చెదను.

శ్లో.16 యద్ధ్యానజం సుఖమవాప్య మనన్త పుణ్యైః
సాక్షా త్తమచ్యుత పరిగృహమాశ్వాపుః ।
గోపాఙ్గనాః కిల యదర్చన పుణ్యమాత్రాన్
సా మే సదా భగవతీ భవతు ప్రసన్నా ॥

తా॥ ఏ దేవి ధ్యానానంద సుఖమును అనంతమైన సత్కార్యములను ఆచరించిన వారు మాత్రమే పొందగలుగుదురో, ఏ దేవిని పూజించి గోపికలు కృష్ణభగవానునితో నైక్యమును పొందగలిగిరో, అట్టి దేవి నా యెడ ప్రసన్నురాలగు గాక !

శ్లో.17 రాత్రిం ప్రపద్యే ఇతి మంత్రవిదః ప్రపన్నాన్ ఉద్బోధ్య
మృత్యవధి మన్య ఫలైః ప్రలోభ్య ।
బుద్ధ్వా చ తద్విముఖతాం ప్రతన న్నయంతీం
ఆకాశ మాదిజననీం జగతాం భజే తామ్ ॥

తా॥ 'రాత్రిం ప్రపద్యే' యను మంత్రములతో ధ్యానించు దేవీ భక్తులు మోక్షమును కాంక్షింతురు గాని ఇతరములైన కోర్కెలు కోరరు. అయినప్పటికిని ఆ జగన్మాత ఐహిక ఐశ్వర్యానందములనెడు మోహములో బడవైచి భక్తులను పరీక్షించును. ఆ పరీక్షలో మోక్ష కాంక్ష తక్క ఇతర సుఖములపై నాసక్తిలేదని భక్తులు గ్రహించిన నాడు వారికి ఆమె మోక్ష వరమునే ప్రసాదించును. అట్టి ప్రవృత్తిగల జగన్మాతను పూజింతును.

---

### శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి !

- శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.
- సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే). M.O. ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.
- M.O. ఫారంలో దిగువ For Communication భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.
- చందా కాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొంటే మంచిది.
- అడ్రసు మార్పును ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి.
- చందా వివరములు తెలుపని యెడల సొమ్మును విరాళముగా జమ చేయబడును.

**కార్యదర్శి, శాంతి ఆశ్రమం (PO)**
వయా శంఖవరం-533 446, తూ॥గో॥ జిల్లా.



# ధ్యానము

## (శ్రీ త్రిపురసుందరీ వేద పాదస్తవః)

---

**ధ్యానించు రోగి భవ రోగము నుండి విముక్తి పొందును.**

త్రికలాఢ్యాం త్రిహృల్లేఖాం - ద్విహంస సర్వభూషితాం ।
యో జపత్యంబ ! తే విద్యాం - సోఽక్షరః పరమ స్వరాట్ ॥ 1

"మూడు 'క' కారములు, మూడు 'ల' కారములు, మూడు 'హ్రీం' కారములు. రెండు 'హ' కారములు, రెండు 'స' కారములు, రెండు అచ్చులు" - వీనిచే అలంకరింపబడిన నీ మంత్ర రాజమును (పంచ దశీమహా మంత్రము) జపించుచున్నవాడు - క్షత తత్త్వముల నతిక్రమించిన స్వయం ప్రకాశమానమైన పరబ్రహ్మమే యగుచున్నాడు.

యస్తే రాకాచంద్ర బింబాసనస్థాం
పీయూషాబ్ధిం కల్పయన్తీం మయూఖైః ।
మూర్తిం భక్త్యా ధ్యాయతే హృత్సరోజే
నతస్య రోగో నజరా నమృత్యు ॥ 2

అమ్మా ! పౌర్ణమి నాటి చంద్రబింబమను ఆసనము నందుండి, తన కిరణములతో అమృత సముద్రమును సృజించుచున్న నీ యాకృతిని ఏ సాధకుడు హృదయ పద్మమున భక్తితో ధ్యానించునో - అతనికి రోగము లేదు. ముసలితనముండదు. మృత్యువు కలుగదు.

వైరించా ఘౌ ర్విష్ణు రుద్రేంద్ర బృందైః
దుర్గా - కాళీ - భైరవీ శక్తి సంఘైః ।
యంత్రేశి! త్వం వర్తసే స్తూయమానా
న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకం ॥ 3

అమ్మా ! శ్రీ చక్రేశ్వరీ ! ఎందరో బ్రహ్మలు, ఎందరో విష్ణువులు, ఎందరో రుద్రులు, ఎందరో ఇంద్రుల - అందరును గుంపులు గుంపులు. ఎందరో దుర్గలు, ఎందరో కాళికలు, ఎందరో భైరవులు, ఎందరో శక్తులు-అందరును సంఘములు సంఘములు. తల్లీ ! నీవాగుంపుల

చేతను ఆ సంఘముల చేతను స్తుతింపబడుచుందువు. అచట సూర్యుడు ప్రకాశింపడు. చంద్రుడు భాసింపడు. నక్షత్రములు మెఱయవు.

**వశ్యే విద్రుమ సంకాశాం విద్యయాం విశదప్రభాం ।**
**త్వా మంబ భావయే ద్భూత్యై సువర్ణాం హేమమాలినీం ॥ 4**

అమ్మా ! వశ్య విషయమున పగడపు కాంతి గల నిన్ను భావింపవలెను. విద్యా విషయమున స్ఫటిక కాంతిగల దానినిగా భావింపవలెను. ఐశ్వర్యము కొఱకు సువర్ణచ్ఛాయ గల బంగారు హారములు ధరించిన నిన్ను ధ్యానింపవలెను.

**భక్త్యా.....భక్త్యా వాపి పద్యావసాన**
**శ్రుత్యా స్తుత్యా చైతయాస్తౌతి యస్త్వాం ।**
**తస్యక్షిప్రం త్వత్ప్రసాదేన మాత**
**సత్యాస్సంతు యజమానస్య కామాః ॥ 5**

ప్రతి శ్లోకమున నాల్గవ పాదము వేదపాదమగునటులీ స్తోత్రము కూర్చబడెను. తల్లీ ! భక్తితో గాని భక్తిలేక గాని ఈ స్తుతి రత్నముతో నిన్ను స్తుతించు యజమానుని కోరికలెల్ల శీఘ్రముగ సత్యములగు గాక !

---


**మాతృ ఆశ్రమం**

1. శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533446
వయా శంఖవరం, తూ॥గో॥ జిల్లా
ఫోన్ : 7382009962
**e-mail : srisanthiashram@gmail.com**

**2. విశాఖ శాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు - 530 017
విశాఖపట్నం, ఫోన్ : 0891-2538689
**e-mail : srisanthiashramvsp @gmail.com**

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి,
విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్,
డార్‌మోనా రోడ్, కోటగిరి-643217
నీలగిరి జిల్లా, తమిళనాడు
ఫోన్ : 04266-271945
**e-mail : vsvmsktg@yahoo.in**
**vsvmsktg@gmail.com**

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్,
కాకినాడ-533 004,
తూ॥గో॥ జిల్లా.

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టుపేట,
పిఠాపురం - 533 450.

**website : www.srisantiashram.org.in**




# ధ్యానము

**ఆంగ్లమూలం : స్వామి ఓంకార్** **అనువాదం : స్వామి తత్త్వవిదానంద**

## శాంతి మరియు ఆనందములే దైవ సామ్రాజ్యములు...

*(గత సంచిక తరువాత...)*

కాబట్టి, నీ స్వరూపములోనికి మరియు వారసత్వములోనికి మేల్కాంచి, నీ స్వరూపమును నీవు పొందినవాడవై, నీ యథార్థమైన హోదాకు మరియు హక్కుకు తగ్గట్లుగా జీవించుము. నీ దైవత్వమును నీవు సర్వదా నిత్యనూతనముగా అనుభూతికి తెచ్చుకో! నీకు ఆ విధముగా అనిపించకున్నా, అది నీవే అనే అనుభూతిని పొందుము. ఎట్టి పరిస్థితులలోనైనా సరే నీయందలి ఈ దైవీ చైతన్యమును పట్టుకొనుము, పట్టు విడువకుము. నీ జీవితములో ఏ నాడైననూ దానిని విడిచిపెట్టకుము. మందగింపు కారణముగా గాని, లేదా నీవైపు నుండి జాగరూకత లేని కారణముగా గాని, నీ దైవత్వమనే విలువ కట్టలేని సత్యమును మరువవద్దు, ఆ సత్యము విషయములో అశ్రద్ధ చేయవద్దు. దేశకాలములు మరియు దేహాభిమానములకు చెందిన ఈ జగత్తు యొక్క సకలసంపదలు, అధికారము, సౌందర్యము మరియు భోగము అనేవాటికి బదులుగా ఆ దైవత్వమును విడనాడకుము. ఎందుకంటే, రెండవది లేని ఏకైకమైన నీ ఆత్మీయమైన చైతన్యమును పోగొట్టుకొని, దాని స్థానమునందు సకల జగత్తు యొక్క చైతన్యము లభించినా, అది నీకు ఏ విధముగా లాభమును చేకూర్చగలదు? ఈ జగత్తు యొక్క ఆటవస్తువులు నిన్ను, నిత్యసత్యమైన దైవత్వముతో ఒక్కటియై ఉన్న చైతన్యములోనికి శాశ్వతముగా మేల్కాంచిన నిన్ను, ఏ విధముగా ఆకర్షించగలవు? నీ హృదయములోని తండ్రి వద్ద నీకు ఆవశ్యకములను ఇచ్చుటకు తగినంత వ్యవస్థ గలదు. దాని వలన నీకు సత్యము కొరకు మరియు ఆనందము కొరకు ఏ నాడైననూ బాహ్య ప్రపంచములో వెదుకవలసిన పరిస్థితి ఏర్పడబోదు. అంతేగాక, నీకు బాహ్యమునందలి గురువులు, సహాయకులు మరియు రక్షకుల ఆవశ్యకత కలుగబోదు. ఆ అధిచేతన (సర్వాతిశాయి యగు యెరుక), ఆ లోపలనున్న పవిత్రమైన చైతన్య ప్రకాశము తన అనుగ్రహంతో నిన్ను అభిషేకించి పట్టాభిషిక్తుని చేసి, నీకు బోధించి, సర్వసత్యములోనికి నిన్ను నడిపించగలదు. ఎందుకంటే, నీవు సత్యమునకు చెందినవాడవై, నీవే సత్యస్వరూపుడవై ఉన్నావు.

ఇప్పుడు మరో సంగతి చూద్దాము. మనము దైవత్వమును సృష్టించలేము, కొనలేము. లేదా మనము వినయముతో ప్రార్థించి గాని, లేక లంచము ఇచ్చి గాని దైవత్వమును సంపాదించలేము. అంతేగాక, లెక్కలేనన్ని ప్రార్థనలైననూ, ప్రయత్నమైననూ దైవత్వమును పొందుటకు తగినంత పుణ్యమును ఈయజాలవు. మనము దైవత్వమును ఏరి కోరి సంపాదించలేము. వీటన్నింటికంటె పైన, మనందరిలో దైవత్వము సర్వదా ఉండనే ఉన్నది అనేది సత్యము. మనలోని దైవత్వము మనకు తెలియని కారణముగా మనము దాని కొరకై వెదుకులాడుతున్నాము. మనము జీవించి ఉన్నాము అనే సత్యమును మనము గుర్తించనిచో, మనము అచేతనులమై, లేదా శవముల వలె, పడి ఉండక తప్పదు. మనలో ప్రాణశక్తి, ఆనందము మరియు శాంతి వెల్లివిరియాలంటే, మనకు ఆ చైతన్యము గలదు అని, మనకు దానికి భేదము లేదు అని మనం తెలుసుకుంటే చాలును. అది సర్వదా మనయందే ఉన్నది అనేది సత్యము. యథార్థంగా చెప్పాలంటే, మనము సర్వదా ఆ చైతన్యమే అయి వున్నాము.

ఏదైనా ఒక వస్తువుతో అభిన్నమై ఉండాలంటే, ఆ వస్తువే అయి ఉండాలి. అదే విధముగా, మనము ఆ శాశ్వత సత్యము కానిచో, మనము స్వయంసిద్ధమైన సత్యతత్త్వమే అయి ఉండనిచో, మనము ఆ సత్యమును ఎంత కోరుకున్నా, ఆశ పడినా, దాని కొరకై ప్రయత్నించినా, ఎన్నటికీ అదియై ఉండుట గాని, అది అగుట గాని, దానితో అభేదము యొక్క అనుభూతిని పొందుట గాని సంభవమే కాదు. దైవత్వమునకు చెందిన తత్త్వము మాత్రమే దైవాంశయై దైవత్వమునందు విలీనమగును. రక్తమాంసాలకు చెందినవి రక్తమాంసాలు మాత్రమే. రక్తమాంసాలు దైవసామ్రాజ్యమునకు వారసులు కాలేవు. పవిత్రాత్మ యందలి ధర్మము, దైవత్వము యొక్క అనుభూతి, శాంతి మరియు ఆనందములే దైవసామ్రాజ్యములు. అవి దానియొక్క సహజసిద్ధమైన నిరతిశయ-ఆనందము (మోక్షము)లు, అవి మానవుని అంతరము నందు ఆ దైవత్వము యొక్క సహజసిద్ధమైన వారసత్వము, అనుభూతి మరియు ప్రకటరూపములు. వాటిని ఆధ్యాత్మికముగా (చైతన్యపరముగా) వివేచన చేయాలి. రక్త మాంసములు, దేహమునకు చెందినవి, ఆ ఆనందములను వివేచన చేయలేవు. వాటిని అంచనా కట్టజాలవు. ఆధ్యాత్మిక సాధన చేసే మనిషి తన ఆనందఘనమైన సత్తను అనుభవిస్తూ ఆనందించే అంశములు అవి (ఆంతర-ఆనందములు) మాత్రమే. అక్కడ జగత్తే వానికి దేవాలయము, సకలపదార్థముల సారతత్త్వమైన పరబ్రహ్మయే ఆత్మరూపముగా ఆ దేవాలయము నందు వెలసిన దేవుడు. అక్కడ ఆతని నేను-భావన, అనగా ఆతని దైవ-ఆత్మ, ఆంతరము నందలి స్వర్గము యొక్క సింహాసనమును అధిష్ఠించి యున్నది. అక్కడ ఉన్నది అంతా జ్ఞానము, పవిత్రత, శాంతి మరియు ఆనందము. రక్తమాంసముల సంతు (అంటే దేహాత్మభావన గల వారలు), వారు యెవరైనా, అక్కడ వెలివేయబడెదరు. వారు బాహ్యమునందలి అంధకారమునకు చెందినవారు. లోపలికి తొంగిచూచుటకైననూ వారికి హక్కు లేదు. ఏడుపు, (కోపముతో) పళ్లను కొరుకుట, చేదైన అనుభవము మరియు హృదయతాపము అనేవి వారి వాటా. ఆత్మకు



చెందిన సర్వము (వారికి) చిక్కు ప్రశ్న మరియు చీకటి గాథయే. వారికి ఆత్మకు చెందిన విషయములు అర్థము కావు. ఎందుకంటే, ఆత్మవిషయములను ఆత్మనిష్ఠములైన ఇంద్రియములతో ఆధ్యాత్మికముగా వివేచన చేయాల్సి ఉంటుంది. కవిని కవి మాత్రమే మెచ్చుకొనగలడు, అనుకరించగలడు. ఒక క్రీస్తు 1 మాత్రమే క్రీస్తును తెలుసుకొనగలడు, క్రీస్తును కనిపెట్టగలడు. దేవుడు మాత్రమే దేవుని తెలియగలడు, దేవుడై ఉండగలడు. ఏకత్వ నియమము అట్టిది. మీరు పాపిని శాశ్వతకాలము ఏదేని ఒక ద్రవములో గాని, ఔషధ ద్రావకమునందు గాని కడిగిననూ, అతడు ఇసుమంతైననూ సాధుపురుషుడు కాజాలడు. ఆఖరికి అట్టి దివ్యౌషధము గాని, దివ్య ప్రక్రియ గాని దేవుని వద్ద కూడా లేదు. అట్లు జరుగుట అసంగతమగును. అది బొగ్గును కడిగి తెల్లగా చేసినట్లు అగును. మీరు బొగ్గును శాశ్వతకాలము బాగా రుద్ది కడుగవచ్చును. కాని, అది యెన్నటికీ తెల్లగా అవబోదు. అదే విధముగా, మీరు ఇప్పటికే దైవత్వ సంపన్నులు అయి ఉండనిచో, మీరు యథార్థముగా దైవత్వసంపన్నులు అగుట గాని, దైవత్వమును అనుభవమునకు తెచ్చుకొనుట గాని అసంభవమయ్యెడిది. ఇది సృష్టి ఉన్నంతకాలము మార్పులేని సత్యము.

పవిత్రమైన అంతఃకరణము గల వ్యక్తికి సర్వము పవిత్రముగా కనబడును. అపవిత్రునకు అన్నీ అపవిత్రములే. ఇదే విధముగా, ఎవడైతే సత్యతత్త్వమునకు చెంది ఉంటాడో, సత్యతత్త్వము నందు నిలిచి ఉంటాడో లేదా తానే సత్యతత్త్వమై ఉంటాడో, వానికి లోపల మరియు బయట సర్వము సత్యమే. వానికి ఉన్నది సత్యతత్త్వము మాత్రమే. భూతవర్తమాన భవిష్యత్కాలములయందు ఆతడు సత్యమును మాత్రమే దర్శించును. రూపములయందు మరియు రూపము లేనివాటియందు ఆతడు సత్యతత్త్వమునే గుర్తించి, దానిని మాత్రమే కొనియాడును. వాని దృష్టిలో నిలిచి ఉండేది సత్యతత్త్వము మాత్రమే. ఆకసమునందు గాని, నేలపై గాని, స్వర్గమునందు గాని, నరకమునందు గాని, సుఖమునందు గాని, దుఃఖమునందు గాని మార్పు లేని, మార్పు చెందని సత్యతత్త్వము మాత్రమే ఉన్నది. ఆతనికి అంతా సమానమే. ఆతడు ఆ సత్యము (పరబ్రహ్మ)తో ఐక్యమై ఉండును.

ఓ పరమపవిత్రమైన సత్యమా! మిత్రులు మరియు శత్రువులు, ప్రక్కయింటి వాళ్లు మరియు పరదేశీయులు, బ్రదికి యున్నవారు మరియు మరణించినవారు, చేతనములు మరియు జడముల రూపములో నీవే ఉన్నావు. నీ దర్శనము మాకు నిరంతరముగా ఉండేట్లుగా మమ్ము ఆశీర్వదించుము! తెలియబడేది నీవే! తెలియబడనిది నీవే! భయంకరమైనవాటియందు నీవు ఉన్నావు! శాంతమైన వాటియందు నీవే ఉన్నావు! జ్యోతులకు జ్యోతివి నీవే, ప్రాణుల ప్రాణశక్తివి నీవే. జీవన సంగ్రామము నందు నీవే ఉన్నావు! శాంతి యొక్క నిశ్శబ్దమునందు నీవు ఉన్నావు! క్రూరులయందు నీవే ఉన్నావు! దయామయులయందు నీవు ఉన్నావు! దుష్టులయందు నీవు ఉన్నావు! మంచివారియందు నీవే ఉన్నావు! సాధుపురుషుడు మరియు పాపి కూడ నీవే!

*1 *దేహాభిమానము లేని ఆత్మనిష్ఠుడు అని స్వామీజీ అభిప్రాయము.*

సూర్యునియందు మరియు ఆ సూర్యుని నుండి వెలువడే కిరణములయందు నీవే ఉన్నావు! కాంతి నీవే, ఆ కాంతి యొక్క ప్రకాశము మరియు దాని శోభ నీవే! గొప్పది నీవే, తక్కువది నీవే! బ్రహ్మాండము నీవే, అణువు నీవే! ఎలక్ట్రాన్ మరియు దానిని కంపింపజేసే శక్తి నీవే! సర్వము మరియు సర్వులు నీవే! సర్వత్రా నీవే ఉన్నావు! ప్రతి అణువులో ప్రకంపించేది నీవే! నీతో మాకు ఉన్న విడదీయరాని ఐక్యము మాకు మా జీవితములలో ప్రతి క్షణము అనుభవానికి వచ్చేట్లు చేయుము.

కాబట్టి మనము ఒక సంగతిని దృష్టిలో ఉంచుకోవాలి. మనము ఉన్న అవస్థలో మన భావాలు, పై అవస్థలలో వస్తువుల వాస్తవికతకు చెందిన స్థితిగతులకంటే చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. సమాధి–అవస్థ (అధిచేతన స్థితి), దానికి చెందిన ఆనందములను గురించి ప్రస్తుతంలో మనకు ఉన్న భావాలు, సత్యసాక్షాత్కారమునకు చెందిన ఉన్నత–అవస్థలయందు, సుతరాము సరిపోవు. ఇక్కడ ఉన్నట్లుగా, అక్కడ సర్దుబాట్లకు గాని, ఆసనములకు గాని, వ్రతము (నియమనిష్టలు)లకు గాని, అనుష్ఠానములకు గాని, ప్రయత్నములకు గాని, ప్రయాసలకు గాని తావు ఉండదు. కాలము, దేశము, ఒడ్డు–పొడవులకు చెందిన భావనలు గాని, లేదా ప్రస్తుతం ఉన్న కారణకార్యభావమునకు చెందిన సిద్ధాంతములు గాని అక్కడ నియంత్రించవు. ఆకాంక్ష, అనుభూతి అనేవే అక్కడి ఉనికిని నియంత్రించే సిద్ధాంతములు. మీరు ఆకాంక్షించండి, మీకు అది ఉన్నది, మీరు దానిని అనుభవానికి తెచ్చుకోండి. మీరు నాయందు (దైవము నందు) నిలిచి (ఐక్యమై) ఉన్నట్లైతే, మరియు నేను (దైవము) మీయందు నిలిచి ఉన్నాను గనుక, మిమ్ములను ఆదేశించి ఉన్నాను గనుక, మీ హృదయసింహాసనమును అధిష్ఠించి ఉన్నాను గనుక, మీరు దేనిని ఆకాంక్షిస్తే, అది మీ స్వంతము అవుతుంది. అది స్వర్గము యొక్క నియమము. మీ వాస్తవచేతన దైవము కంటె అభిన్నము, వేరే ఏదీ కాదు. మీరు ఆ ఏకత్వమును శాశ్వతముగా అనుభూతికి తెచ్చుకోవాలని కోరుకుంటున్నారా? అట్లైనచో, మీకు ఆ ఏకత్వము శాశ్వతముగా లభిస్తుంది. మీరు అటులనే కోరుకుంటారని అనుకుంటాను. ఆ ఏకత్వమునకు విరుద్ధమైన నియమము ఏదీ లేదు. ఏదీ దానిని అడ్డు పెట్టలేదు. దాని నుండి మిమ్ములను రవ్వంతయైననూ ఒక్క క్షణమైనా ప్రక్కకు తప్పించేది యేదీ లేదు. కాబట్టి, శాశ్వత సత్యము యొక్క సంతానమైన ఓ జనులారా! మీరు శాశ్వత సత్యము నందు నిలిచి యుండుడు. ఎందుకంటే, మీరు శాశ్వత సత్యమునకు చెందినవారై శాశ్వత సత్యమునందే, శాశ్వత సత్యమే అయి ఉన్నారు. శాశ్వత పిత (మూలపురుషుడు), శాశ్వతసత్ అగు పరమాత్మ యొక్క నియమముచే అది మీకు శాశ్వతమైన జన్మహక్కు. మీ ఆత్మలను నిత్యశాంతి యందు ఆవేశింపజేయుడు. ఎందుకంటే, ఆ శాంతి సకల కాలములయందలి సకల వస్తువుల యొక్క సకల జ్ఞానమును కూడ అధిగమించి యున్నది.

*(సశేషం....)*



# ప్రణవము

**(శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాల సందర్భంగా తేది. 30-11-2016న కాకినాడ శాఖలో ఇచ్చిన దివ్య సందేశము)**

***- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు***

**ఓంకారాన్ని ధ్యానించేవాడు పరమగతిని పొందును.**

*(గత సంచిక తరువాత)...*

"ప్రణవము ధనస్సు, బాణములు గురి చూసి లక్ష్యము దేని మీదకి వేస్తారో అంటే పరబ్రహ్మమే లక్ష్యం అవుతుంది." అందుకు వేద మంత్రం

**"బ్రహ్మణః కోశోసి మేధయా పిహితః ।**
**శ్రుతం మే గోపాయ" ॥**
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

అది "పరబ్రహ్మ"మన్న "కత్తి"ని దాచిన "ఒర" "ప్రణవము". కాబట్టి ఆ అకార, ఉకార, మకారములచేత ప్రతిపాదింపబడినటువంటి పరబ్రహ్మతత్త్వమును అనేక కోణముల నుండి విచారణ చేస్తూ ఉంటారు. ఈ విచారణ తమంత తాముగా చేయలేమని, తేలిక మార్గంగా ఏం చేస్తారంటే, విచారణ చేయించడం కోసమే, పూజలోకి తీసుకొస్తారు. మీరు బాగా గమనించారో లేదో పూజ అందరూ చేస్తారుగా! పూజ చేయకుండా వుండరు, కోరికతో కానివ్వండి, అవసరానికి కానివ్వండి, ఆర్తితో కానివ్వండి, జిజ్ఞాసతో కానివ్వండి, జ్ఞానియై కానివ్వండి భగవంతుణ్ణి ఆరాధన చేస్తారు. భగవదారాధన యందు మీరు గమనించండి ఓం కేశవాయ నమః, ఓం నారాయణాయ నమః, ఓం మాధవాయ నమః, ఓం గోవిందాయ నమః, ఓం నిధనపతయే నమః, ఓం నిధనపతాంతికాయ నమః, ఓం శ్రీమాత్రే నమః మీరు ఎవరిని పూజ చేస్తున్నారో వాళ్ల నామం మధ్యలో మారుతుంది, అటు ఇటూ మంత్రం మారదు. ఇటు "ఓం" ఉంటుంది. అటు "నమః" ఉంటుంది. మధ్యలో ఏం మారుతుంది! నామం మారిపోతుంది. నేను అమ్మవారి పూజ చేస్తానండీ ఈవేళ అన్నాననుకోండి, ఓం శ్రీమాత్రే నమః, 'ఓం', 'నమః' తీసేసి, శ్రీమాత్రే, శ్రీమాత్రే అంటే కుదరదు. ఓం శ్రీమాత్రే నమః అంటున్నారా? లేదా? పూజకి నేను శివుడ్ని పూజిస్తున్నాను. ఓం నిధనపతయే నమః, ఓం

నిధనపతాంతికాయ నమః, ఓం ఊర్ధ్వాయ నమః, నేను ఇవాళ విష్ణువును పూజిస్తాను. ఓం గోవిందాయ నమః, ఓం విష్ణవే నమః, ఓం మధుసూదనాయ నమః, ఓం నారసింహాయ నమః. "ఓం", "నమః" అలాగే ఉన్నాయి. మారలేదు. మధ్యలో నామం మారింది. ఎందుకలా? అలా కాకుండా అమ్మవారి పూజలో ఇలా ఉండదు. విష్ణువు పూజలో ఇలా వుండదు. శివపూజలో ఇలా వుండదు. ఒకళ్ళకి "ఓం", "నమః" ఉంటాయి. ఇంకొకళ్లకి ఇంకేదో వుంటుంది అనకుండా, అన్ని పూజలలో ఏ నామాన్ని చెప్పి మీరు పూజ చేసినా 'ప్రణవం' మాత్రం మారడానికి వీలు లేదు. "ఓం" ముందుండాలి, "నమః" చివరుండాలి, మధ్యలో నామం వుండాలి. ఎందుకలా పెట్టారు? పూజని అలా ఋషులు ఎందుకు అంత అందంగా వరఒడి లోనికి తీసుకొచ్చారు? అంటే మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి. "ఓం" అంటే "అవ్యక్తమైన పరబ్రహ్మము". ఆయనే సృష్టికర్త, ఆయనే స్థితికర్త, ఆయనే ప్రళయకర్త, అన్నీ కలిసిపోయినటు వంటి ముద్ద. అది కాంతి పుంజము. దానికొక రూపముండదు. మీకు ప్రత్యక్ష ఉదా:- సూర్యభగవానుడు. సూర్యభగవానుడు కళ్ళ ముందు కనబడుతుంటాడు ఆయనే సృష్టికర్త, ఆయనే స్థితికర్త, ఆయనే ప్రళయకర్త, ఆయనకన్నా భిన్నంగా ఏం వుండదు. ఆయనే ముగ్గురు మూర్తుల యొక్క రూపం. ఆయనే మూడు వేదముల యొక్క రూపం.

"మీరజాకరములు నిష్క్రియకించిన భవ్యతపంబు కలమనంగ,
విలసము కాకినందిన చక్రయుగ్మకంబుల ఎదురాగంబల భ్రూవనంగ,
హరిహర బ్రహ్మ మహానుభావంబు లొక్కటి కాగ, గరంగ గట్టియనన
అతులవేదత్రయ లతికాశ్రయము పెనుగొనంగ బుట్టెడు మూలకందమనగ
అఖిలజగములు కందెర యగుచు జలసమాజ కరుపుట హృదయ
సరోజపుట కను సరోజంబులో, జృంభణము జొచ్చి భానుబింబము
పూర్వాగ్రపై వెలింగె" అంటారు తిక్కన గారు భారతంలో.

"హరిహర బ్రహ్మ మహానుభావంబు లొక్కటికాగ గరంగ గట్టియనగ, బ్రహ్మ, విష్ణువు, శివుడు ముగ్గురు కలిపి ముద్దయిపోతే అది సూర్యబింబం, అయితే మీరిప్పుడు దానిని సృష్టికర్త, స్థితికర్త, లయకర్త అని చెప్పగలరా! చెప్పలేరు కానీ, తెల్లవారుఝాము బింబం 'బ్రహ్మ'గారు, మధ్యాహ్న బింబం శివుడు, సాయంకాల బింబం ప్రదోషవేళకు ముందున్నటువంటి బింబం విష్ణువు. ముగ్గురుగా ఆరాధన చేస్తారు. ముగ్గుర్ని ఆయనలోనే చూస్తారు. పరబ్రహ్మము రెండూ చేయగలిగిన ఒక్కటై నిలబడుతుంది. ఆ పరబ్రహ్మ అనుకొన్నటువంటి గుణం ఏమిటంటే, అది ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క చమత్కారమైన పని చేస్తుంది. నిజానికది అలా ఉండవలసిన అవసరం లేదు. అదో పని చేయవలసిన అవసరం లేదు, దానికి పుట్టవలసిన అవసరం లేదు.

"అజాయమానో బహుధా విజాయతే" అంటుంది వేదం. పుట్టనవసరం లేనటువంటి వాడు ఎన్నోసార్లు పుట్టాడు అంటుంది వేదం. మరి అవతారాలు రావా! మీరిందులో గమనించ వలసింది ఏమిటంటే, నిర్గుణుడైనటువంటి బ్రహ్మము నందు గుణము ప్రవేశించింది, ఎవరి కోసం, నిర్గుణమైన బ్రహ్మము సగుణమైన బ్రహ్మము కంటే గొప్పది అంటే, తత్త్వము నందు, కాని భక్తుడి మార్గంలో ఆలోచించినప్పుడు రెండోది కూడా చాలా గొప్పది. భగవంతుడు ఒక గుణ ప్రకటనము చేస్తే ఒక పేరు వస్తుంటుంది. మీరు కొంచెం జాగ్రత్తగా ఆలోచించండి, నాకు కోటేశ్వరావు అని పేరుంది. కోటేశ్వరావు గారిని వేదిక మీదికి రండి అంటే నేను చటుక్కున లేచి వస్తాను. నాకు వెయ్యి పేర్లు ఉన్నాయనుకోండి, మీరు శ్రవణ్ కుమార్‌ని రమ్మంటున్నాం అనుకోండి. నాకు ఆ పేరు వుందని గుర్తుండదు. ఎవరో ఒకళ్లు కూర్చుంటారు. శ్రవణ్ కుమార్ (837) ఎనిమిది వందల ముప్పై ఏడవ పేరు మీదే అంటే అప్పుడు నేను రావాలి. అంటే ఎందుకని, వేయి పేర్లు పలకటానికి ఒక్క పేరు చాలదూ ! ఏంటి అన్నివేలా! విష్ణు సహస్రం, శివ సహస్రం, గాయత్రీ సహస్రం, లలితా సహస్రం ఏంటా సహస్రాలు? ఎందుకు అన్ని పేర్లు? అంటే మీరొకటి బాగా గుర్తు పెట్టుకోండి. అవి నామవాచకములు కాదు. అవి పేర్లు కావు. నిజానికి, అవి 'గౌణ'ములు అంటారు. పరబ్రహ్మము ఒక్కొక్క గుణమును ప్రకటిస్తుంది. ఒక్కొక్క గుణాన్ని ఎవరి కోసం ప్రకటిస్తుంది. భక్తుల కోసం ప్రకటిణం చేస్తుంది. అలా ప్రకటణం చేసినప్పుడు ఒక్కొక్క పేరు వస్తూ వుంటుంది. బ్రహ్మమునకు, అంటే ఆ పేరు పెట్టి నేను పిలిచి పూజ చేసేటప్పుడు నిజమునకు బ్రహ్మము నందు నేను రమించాలని గుర్తు. మీరు పట్టుకున్నారో లేదో నిజానికి 'ఓం గోవిందాయ నమః'! అన్నాన నుకోండి, అలా పూవు వేసేయడం కాదు, పూవు తీసుకొని ఇలా గుండెలకు చూపిస్తూ వేయమని, పురుషులైతే ఇలా గుండెవైపుకు చూపిస్తూ ఇలా వేస్తారు, అంటే నీకూ, నాకూ వున్న సంబంధాన్ని చెబుతున్నాను. అకార, ఉకార, మకారముల చేత నీకు నాకు ఉన్న అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్నాను. యదార్థమునకు ఇక్కడ (హృదయములో) ఉన్నది నీవే. "నీవార శూకవక్త, న్వీపీతా భాస్త్వణూపమా" వడ్లగింజ పట్టుకొని కొనతో గీకితే మొన గీరుకొన్నంతగ ఇక్కడ "పరబ్రహ్మము" ప్రకాశిస్తోంది. కాంతితో వుంది. "ఊర్ధ్వమూలమధశ్శాయి" దాని కాంతిపైకి, క్రిందికి పక్కలకి కొడుతోంది. ఇక్కడ వున్నటువంటి నువ్వు ఒక రూపాన్ని పొందావు. ఒకప్పుడు ఒక గొప్ప ఉపకారం చేసావు లోకాలకి. అప్పుడు నీ పేరు విష్ణువు. నీ పేరు కృష్ణుడు. ఏం చేశావ్? గోవిందా అని పేరు పొందావ్ ఏం చేసి? ఏడు రాత్రులు, ఏడు పగళ్ళు కొండ ఎత్తి పట్టుకున్నావ్, ఇంద్రుడొచ్చాడు, వర్షం కురిపించాడు, ఆవుల్ని, దూడల్ని చంపేస్తానన్నాడు. గోపాల బాలుర్ని చంపేస్తానన్నాడు. వాళ్ళందరికీ కష్టం కలిగింది – వాళ్ళందరూ వెళ్ళారు. చిన్ని కృష్ణుని కాళ్లు పట్టుకున్నారు. ఆయనేం చేసాడు? వెంటనే రక్షించాడు. ఇదీ భగవంతుని యొక్క కారుణ్యం!.

*(సశేషం...)*

# శ్రీ దేవీ బీజాక్షర మహిమ

**- శ్రీమతి వాడ్రేవు శారద**

**ఏది చూచునో అది పలుకదు,**
**ఏది పలుకునో అది చూడదు.**

శ్రీ దేవీ రూప పరిమాణమే సకల చిదచిదాత్మక, చరాచరాత్మక జగత్తులగుటచే ఆమె సర్వరూప, సర్వభూతముల యందలి చైతన్యము నామెయే. ఈమె నిత్య నిర్గుణ, నిర్వికల్ప, శివస్వరూపిణి, విశ్వాధార, యోగగమ్యతురీయ. ఈమె యొక్క సాత్విక రాజస తామసశక్తులే శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహా సరస్వతి, శ్రీ మహాకాళియను త్రిమూర్తి స్వరూపిణులుగా తెలియ బడుచున్నవి. ఈ మహాదేవియే సర్వభూతములకు ఆధారము. శ్రీ, క్షమ, బుద్ధి, కాంతి, శాంతి, శ్రద్ధ, మేధ, ధృతి, స్మృతి, ప్రణవము, సప్త వ్యాహృతులు, జయ, విజయ, ధాత్రి, లజ్జ, కీర్తి, దయ, స్పృహ కూడా ఈమె స్వరూపములే. ఈ భూమిపై శక్తిరహితుడని, విష్ణుహీనుడని గాని, రుద్రహీనుడని గాని లోకులు అనరు. శక్తిహీనుడని హేళన చేతురు. శక్తియే సృష్టికి అంతటికి మూలము. ఆ మహాశక్తి అంశములయిన మహాసరస్వతిని గ్రహించి బ్రహ్మ రజో గుణాత్మకమైన సృష్టి కార్యమును చేయుచున్నాడు. శ్రీ మహాలక్ష్మి సహాయముతో సత్వగుణముతో శ్రీ మహావిష్ణువు లోకములను పరిరక్షించుచున్నాడు. శివుడు పార్వతి (మహాకాళి) సమేతుడై తమోగుణ ప్రధానుడై జగములకు లయ కారుడగుచున్నాడు. వీరు ముగ్గురు పరాభట్టారికయగు లలితాదేవినారాధించి ప్రణవాత్మమగు నవాక్షరి మంత్రమును సబీజముగా నిరంతరము జపించుచు తమ కర్తవ్యములను నిర్వహించుచున్నారు. ఈ బీజాక్షరములలో నొకదానినైనను, తెలిసియైనను, తెలియకయైనను జపించి ధ్యానించినను సర్వమనోరధములీడేరును. శ్రీ దేవీ మంత్రముల బీజాక్షరముల మహత్యము వర్ణింపలేము.

పూర్వము కోసల దేశమున దేవదత్తుడను బ్రాహ్మణుడు పుత్రార్ధము పుత్రకామేష్ఠి జరిపెను. అందు గోభిలుడనునుద్గీత స్వరభంగమొనర్చెను. దేవదత్తుడు అతనిని మూర్ఖుడనగా, అతడు కోపించి నీకు మూర్ఖుడగు పుత్రుడు కలుగునని శపించెను. మరల దుఃఖితుడైన దేవదత్తుని చూచి జాలిపడి మూర్ఖుడైనను విద్యాంసుడగునని అనుగ్రహించెను. దేవదత్తుని కుమారునికి ఉతథ్యుడని పేరిడిరి. ఎనిమిదవ యేట ఉపనయనమయి, పన్నెండేళ్ళు వచ్చినా, అతడు సంధ్యా వందనాది అనుష్ఠానములు చేయలేకుండెను. ఆ మూర్ఖ బాలుడు తల్లిదండ్రులచే, బంధువులచే నిందింపబడి, లోకముచే పరిహసించబడి, వైరాగ్యము చెంది, గంగాతీరమున, కుటీరము ఏర్పరచుకొని జీవించుచుండెను. నేనేవిధముగనైనను, నేనెన్నడైనను నసత్యమాడనని ప్రతిన చేసుకొనెను. వేధాధ్యయనము, జపధ్యానములు, దేవతార్చన యెఱుగకపోయినను, అసత్యమాడకుండుట వలన, లోకులతనిని 'సత్యకపు'డని పిలువసాగిరి. ఇట్లు పదిహేనేండ్లు ఒంటరిగా విరక్తుడై జీవితమును పరమశాంతముగా గడిపెను.

ఒకనాడు ఒక బోయవాడు ఒక పందిని బాణముతో కొట్టెను. అది ప్రాణరక్షణకై సత్యవ్రతుని చెంతకు పరుగెత్తెను. నెత్తురుతో తడిసి, వణుకుతున్న పందిని చూసిన అతని గుండె దయతో నిండెను. అతడు దానిని సారస్వత బీజమగు 'ఐ' కారముతో ఆదరించెను. ఆ బీజాక్షరము అతని నోట దైవయోగమున వచ్చెను. అది వేద మహామంత్ర బీజాక్షరమని అతనకి తెలియదు. ఆ వరాహము ఆశ్రమ పొదరింట దూరెను. ఆ వేటగాడు సత్యవ్రతునికి నమస్కరించి పందిని అడిగెను. హింసతో కూడిన సత్యము సత్యము గాదు, దయతో కూడిన య సత్యము సత్యమే అగును. పందికి మేలు, తను నిజము పలుకుట ఎట్లు జరుగునను ధర్మ సంకటములో పడిన సత్యవ్రతునికి పందిని ఆదరించినపుడనిన 'ఐ' అక్షరమే వాగ్బీజమయ్యెను. వాగ్రూపిణియైన సరస్వతీదేవి సంతోషించి మహావిద్యను ప్రసాదించెను. అతడు బోయవానితో "ఏది చూచునో అది పలుకదు, ఏది పలుకునో అది చూడదు'" అని బదులిచ్చి పంపించివేసెను. అనంతరము అతడా వాగ్బీజమును నిరంతరము జపించుచూ, పండితోత్తముడయ్యెను.

కోసల రాజ్యమేలు ధృవసంధికి మనోరమ, లీలావతియను ఇద్దరు భార్యలు. ఇరువురికి ఒకే మాసమున పుత్రులుదయించిరి. మనోరమ పుత్రుడు సుదర్శనుడు జ్యేష్టుడు. లీలావతి కుమారుడు శత్రుజిత్తు – చాటు భాషణములతో రాజునకు, మంత్రులకు, ప్రజలకు ప్రీతి పాత్రుడయ్యెను. వేటకేగిన ధృవసంధి సింహము వాతపడెను. శత్రుజిత్తు పితామహుని అండతో రాజయ్యెను. మనోరమ సుదర్శనునితో భారద్వాజాశ్రమున ఆశ్రయమును పొందెను. తమ మంత్రియగు విదల్లుని మునిబాలులు క్లీబుడని గేలి చేయగా సుదర్శనుడు 'క్లీం' కారమును మననము చేయసాగెను. కామరాజ బీజమగు ఆ ఏకాక్షరమును అతడు సర్వవిజ్ఞానసారమని యెరిగి ఎల్లవేళల జపించుచుండెను. భరద్వాజమునిచే నుపవీతుడయినతడు 'క్లీం' మంత్ర ప్రభావమున కామకళా శక్తియగు శ్రీ వైష్ణవీ దేవిని సందర్శించెను. ఆ దేవి విల్లమ్ములు, కవీశన తూణీరములు అతనికి ప్రసాదించెను. కాశీరాజ పుత్రి శశికళ, సుదర్శనుని గుఱించి విని, యతనిని వరించెను. జగదంబయామెకు స్వప్నదర్శనమిచ్చి ఆశీర్వదించెను. కాశీరాజు ప్రకటించిన స్వయంవరమునకు తల్లితో సుదర్శనుడేగెను. పుత్రిక ప్రోద్బలముతో కాశీరాజు

సుదర్శనునికి తన కూతురితో వివాహమొనర్చును. సుదర్శనుని నంతమొందింప వచ్చిన రాజులను దుర్గాదేవి వివిధ రూపములు దాల్చి వధించెను. కాశీరాజగు సుబాహుడు దుర్గను పరమ ప్రీతితో స్తుతించెను. సుప్రీతయయిన భవానీదేవి 'భూమి నిలుచునంతవరకు అవిముక్త క్షేత్రములో విశ్వసంరక్షణకై నివసింతును'ని వరమిచ్చెను. చిఋత ప్రాయము నుండి శ్రీ భగవతి కామరాజ బీజమంత్రోపాసనతో సుదర్శనుడు పత్నిని, పైతృక రాజ్యమును పొందెను.

సార్వోచిష మన్వంతరమున సురధుడను సకలగుణములు గల రాజు కలడు. మ్లేచ్ఛులు అతనిపై దండెత్తిరి. మంత్రులు కూడ శత్రు పక్షమున చేరుటచే రాజు ఒంటరిగా పురమును విడిచెను. అరణ్యమునగల సుమేధుని తాపసాశ్రమును చేరెను. ఫలమూలాదులు తినుచు సుమేధుని రక్షణలో నిర్భయుడు, నిశ్చింతుడు, శుచియై యుండెను. ఒకనాడతడు తన రాజ్యమును తలచి చింతాక్రాంతుడై యుండగా, సమాధియను కోమటి దుఃఖముతో వచ్చెను. ధనాశాపరులైన అతని భార్యా పుత్రులు లోభియని యతనిని యింటి నుండి గెంటివేసిరి. వారిరువురును మునిని తరుణోపాయమును వేడిరి. సుమేధముని వారికి దేవీమాయను వివరించి దేవీ నవరాత్రి విధానమును యెరిగించెను. దేవీ నవాక్షర మంత్రమునుపదేశించెను. మూడేండ్లు వారు తపమాచరించి నను కనులకు దేవీ సాక్షాత్కారము దక్కలేదు. వారిరువురు దుఃఖించి, యగ్ని కుండమేర్పరచి, తమ శరీరముల నుండి మాంసమును కోసి, అగ్నిలో వేల్చిరి. అప్పుడు వారికి దేవి ప్రత్యక్ష సాక్షాత్కారమొసగెను. రాజునకు పదివేల యేండ్లు రాజ్య పాలనా అనంతరము తనువు చాలించి, సూర్య సావర్ణిమనువుగా నుద్భవింపగలవని వర మిచ్చెను. వైశ్యునికి బంధగ్రంధి నాశనమును, మోక్షప్రదమగు బ్రహ్మజ్ఞానమునిచ్చెను.

ఇహపరలోక బంధములు త్రుంచుకొనగోరువారు, త్రిగుణాత్ములయిన మానవులు తరించుటకు, ఇహలోక వాంఛితములు తీరుటకు, ధర్మార్ధ కామ మోక్షములు బడయుటకు భగవతిని కొలువవలయును. శ్రీ దేవిని ధ్యానించవలెను. శ్రీ మాతను ఆరాధించవలయును. శ్రీ మహారాజ్ఞికి మోకరిల్లవలయును. శ్రీ రాజరాజేశ్వరిని జపించవలయును. శ్రీ లలితా పరా భట్టారిక మనలనందరను గాచి, బ్రోచి మనపై తన కరుణా కటాక్షములను గురిపించుగాక!

**శ్రీ మాత్రే నమః**

***(వ్యాస విరచిత శ్రీదేవీ భాగవతము ప్రథమ భాగము నుండి)***

---

ఈ ఉపదేశములు, బోధలు, ఎన్ని విన్నను నీకు నీవు బోధించుకొనుట (ఆచరించుట) మొదలిడినగాని ఏమియు ప్రయోజనము లేదు. ఇతరులకు ఉపదేశించుట సులభమే, వినుట అంతకంటే సులభము. కాని ఆచరణయే ముఖ్యము.

**– శ్రీ ఓంకార్ స్వామి**



# శ్రీ దేవీ పురాణం
## (హయగ్రీవ అవతారం)

**– డా॥ కె. వెంకట శివయ్య, IAS (Rtd.)**

**పురుష ప్రయత్నం వున్నా దైవానుగ్రహం చేతనే కార్యం సఫలమగును.**

శ్రీహరి కేవలం దశావతారాలే కాకుండా భక్తులకు ఆపదలు కలిగినప్పుడు ఇంకా ఎన్నో అవతారాలను ఎత్తాడు. అందులో హయగ్రీవ అవతారం కూడ ఒకటి. దేవీ భాగవతం సాక్షాత్ వ్యాసుడే జనమేజయుండుకు చెప్తుతుండగా వ్యాసుని ప్రియశిష్యుడు సూతుడు అక్కడ ఉన్నాడు. అందువలననే దేవీభాగవతం చెప్పడానికి సూతుడు అధికారం సంపాదించాడు. సూతుడు చెప్పిన విధంగా పురాణం ఇంక ఎవరూ చెప్పలేదు.

సనాతనుడైన జనార్ధనుడు ముందుకాలంలో రాక్షసులతో 10,000 సం॥లు యుద్ధం చేయుటవలన అలసిపోయెను. లక్ష్మీదేవికి కూడ చెప్పకుండా విశ్రాంతి తీసుకోవడానికి ఎక్కడో అరణ్యంలోనికి వెళ్ళిపోయెను. అదే సమయంలో కొందరు మహాత్ములు ఒక మహా యజ్ఞం తలపెట్టి దాన్ని శ్రీహరి సమక్షంలో ప్రారంభించాలని ఆయన్ను వెతుక్కుంటూ వైకుంఠానికి వచ్చిరి. అక్కడ ఆయన జాడ లేదు. అప్పుడు వారి దివ్యదృష్టిలో ఆయన ఉన్నచోటుని కనుగొని, అక్కడకు బ్రహ్మ, శంకరుడు, ఇంద్రుడు, లక్ష్మీదేవితో సహా చేరిరి. అక్కడ శ్రీహరి ధనస్సును సమతలంగా చేసుకొని ఒక కొన కాలు దగ్గర, మరొక కొన ఖంఠం దగ్గర వుండే విధంగా పెట్టి దానిపైన పడుకొని దీర్ఘ నిద్రలో వున్నారు. ఆయన్ను నిద్ర లేపమంటే ఇంద్రుడు నిద్రాభంగం మహా పాపము నేను చేయను అంటాడు. అలా శ్రీహరిని నిద్ర లేపుటకు ఎవ్వరూ ముందుకు రాలేదు. అప్పుడు ఒక చెదపురుగును పిలిచి వెళ్ళి ఖంఠం దగ్గర ఉన్న ఆ ధనస్సు యొక్క త్రాడును కొరుకు. అప్పుడు ఆ కదలికకు శ్రీహరి నిద్ర లేస్తాడు అనిరి. అప్పుడు ఆ చెద పురుగు "నిద్రాభంగం, కథాచ్ఛేదం (పురాణ కథలు పఠిస్తున్నడు భంగం చేయుట) తల్లి నుండి బిడ్డలను వేరుచేయుట వంటివి బ్రహ్మహత్యా మహాపాతకం. నేను ఇంతటి పాపం చేయడం వలన నాకు ఫలితం ఏమిటి?" అని అడిగెను. అప్పుడు చేయబోయే యజ్ఞఫలం హవిస్సులో భాగం ఇస్తానన్నాడు బ్రహ్మ చెదపురుగుతో. అప్పుడు చెదపురుగు నేలవైపు ఉన్న

భాగంలోని ఒక త్రాడును కొరికింది. అప్పుడు సమతలంగా వున్న ధనస్సు పూర్వస్థానానికి వచ్చింది. అంతే, బ్రహ్మాండం అంతా దద్దరిల్లినది. సముద్రాలు వువ్వెత్తున లేస్తున్నాయి. పర్వతాలు కదలిపోతున్నాయి. ఉల్కాపాతం సంభవించినది. హరి యొక్క తల ఎగిరి ఎక్కడ పడిందో ఎవరికీ తెలియలేదు. అందరూ విష్ణుమూర్తినే ప్రార్థిస్తున్నారు. ఏంటి ఈ విపరీతం? ఏంటి హరి లీల? ఏంటి ఈ ఘోరం? ఏంటి ఈ మాయ? అని అందరూ పలురకాలుగా దుఃఖిస్తున్నారు. అప్పుడు బృహస్పతి ముందకు వచ్చి ఇప్పుడు దుఃఖించి ఏ ప్రయోజనం లేదు. దైవ అనుగ్రహం లేదా పురుష ప్రయత్నం వలనే ఏ కార్యం అయినా సాధ్యం అవుతుంది. అప్పుడు బ్రహ్మ, “ఇదంతా దైవ పరీక్షే ! ఒకప్పుడు నా స్వయం కృపారాధన వలన పంచ శిరస్సులలో ఒక శిరస్సు కూడ ఇలా తెగింపబడినదే” అనెను.

అప్పుడు పరాశక్తిని ఇలా ప్రార్థించిరి. సర్వజీవులలోను ధీ, ఐశ్వర్యం, కాంతి, క్షమ, శాంతి, శ్రద్ధ, మేధ, స్మృతిగా వున్న ఓ తల్లీ ! ఏంటి నీ మాయ? ఏంటి శ్రీహరిని నీవు ఇలా చేశావు? మాకు అండగా వున్న శ్రీహరి లేకపోతే మేము ఏమి చేయగలము? స్థితికారకుడు లేకపోతే మనుగడ ఎలా సాగుతుంది? శ్రీహరినో లేదా మేము ఏమి తప్పు చేశాము? ఈ దుస్థితికి కారణము తెలుపమని ప్రార్థించిరి మరియు లక్ష్మీదేవి ఏ దోషం చేసినదని ఈ పరీక్ష? అని అడిగిరి. అప్పుడు పరాశక్తి అశరీరవాణియై దేవతలారా ! ఒకప్పుడు లక్ష్మీదేవికి తమోగుణ ప్రభావం చేత శ్రీహరి మీద సందేహం కలిగెను. హరికి మరో స్త్రీ పైన మోహం వున్నదేమో అని ! అప్పుడు ఆమె దుఃఖితురాలై హరి శిరస్సు ఖండింపబడుగాక ! అని భావించెను. అయినను ఇది అంతయు లోక కళ్యాణార్ధమై జరిగెను. హయగ్రీవుడు అన్నపానములు మాని 1000 సం॥లు తపస్సు చేసెను. ఇక విధి లేక నేను ప్రత్యక్షమయితిని. అప్పుడు అతడు వరం కోరెను. సురాసురలను జయించే శక్తి మరియు అమరత్వం ప్రసాదించమని. నేను సాధ్యం కాదంటిని మరేదైన వరం కోరుకొమ్మని హయగ్రీవుడికి చెప్పితిని. అప్పుడు అతడు నిజంగా హయగ్రీవుడు (గుఱ్ఱపు తల కలిగిన మనిషి) చేత నాకు మరణం కలిగే వరం ఇవ్వమని హయగ్రీవుడు కోరెను. కాబట్టి ఆ హయగ్రీవుడిని సంహరించుటకు ఇప్పుడు నిజమైన హయగ్రీవుని సృష్టి అవసరం అయినది.

కాబట్టి మంచి గుఱ్ఱం తల ఒకటి తెచ్చి శ్రీహరి మొండెమునకు అతికించమనెను. అప్పుడు బ్రహ్మ గుఱ్ఱం తల తెచ్చి శ్రీహరి మొండెమునకు పెట్టి ప్రాణం పోసెను. అదే హయగ్రీవుడి అవతారం. అప్పుడు శ్రీహరి హయగ్రీవుడి అవతారంలో హయగ్రీవుడు అనే అసురుడిని సంహరించెను. తర్వాత ఆ అవతారాన్ని ఉపసంహరించి శ్రీహరి యధావిధిగా వైకుంఠం ఏగెను.



# కైవల్యోపనిషత్

*- స్వామిని శృతానంద*

**భగవంతుడా! చంద్రునిలో కూడ మచ్చ వున్నది, కాని నా మనస్సులో మాత్రం ఒక్క మలినం కూడ ఉండకూడదు.**

వ్యక్తమైనటువంటి ఈ సృష్టికి కారణం పరమాత్మ. బ్రహ్మ నుండి ఈ సృష్టి యావత్తు ఉద్భవించినది. మన ఆరాధనమూర్తులు విష్ణు, శివుడు అందరూ కూడ అరూపం నుండి వచ్చారు. అంటే ఏ రూపమూ లేని దాని నుండి వచ్చారు. వేదాంత సత్యాలను మనకు అర్ధం చేయడం కోసం సాక్షాత్ పరమాత్ముడే రాముడు, కృష్ణుడు అవతారంతో ఈ భూమికి రావడం జరిగినది. మనం ఎలా జీవించాలో జీవించి చూపాడు రాముడు. మనం ఎలా చెయ్యాలో కార్యాల్ని చేయించి చూపాడు కృష్ణుడు. పరమ సత్యాన్ని కేవలం ప్రతిపాదిస్తే సరిపోదు కదా! జీవించి చూపాలి. అందుకే పరమాత్మ అనేక రూపాలలో వచ్చాడు. ఆ రూపాలన్నీ మనం ఆరాధన చేస్తాం. వ్యక్తమైనటువంటి ఈ రూపాల్ని ఆధారంగా చేసుకొని అవ్యక్తమైన ఆ సత్యాన్ని తెలుసుకోవాలి.

**“నాన్యః పంథా విముక్తయే”** సాధకుడు సాధనలో వాసనా క్షయం చేసుకుంటూ పురోగమించాలి. అంతేగాని దగ్గరి దార్లు ఏమి వుండవు ముక్తిని పొందడానికి. కాకపోతే సాధనలో ఎన్ని ఆటంకాలు వచ్చినా, ఆపకుండా ప్రయత్నం చేస్తూ వుంటే, భగవంతుడు త్వరితగతిన పురోగమించడానికి సహాయం చేస్తాడు సాధకుడికి.

స్వప్నావస్థలో జీవుడు అవిద్య చేత (స్వమాయయా) ఇంకొక సృష్టిని సృష్టించుకొని జాగ్రదవస్థలో సుఖదుఃఖాలను పొందినట్లే ఇక్కడ కూడ పొందుతున్నాడు. తర్వాత సుషుప్తి అంతా గాఢ నిద్ర. సుషుప్తి నుండి వాసనల ప్రేరణల వలన జీవుడు మళ్ళీ జాగ్రత్ అవస్థలోనికి వస్తున్నాడు. ఈ విధంగా పురత్రయం (3 అవస్థల) నందు ఆత్మ క్రీడించుచున్నది. ఆత్మ నుండే విచిత్రమైన ఈ సకల జగత్తు ఉద్భవించినది.

ఈ 3 అవస్థలకు ఆధారము పరమాత్మే. అతడే అఖండ జ్ఞాన స్వరూపుడు. అతని యందే తిరిగి ఈ 3 అవస్థలు లయము పొందుచున్నవి. ఇక్కడ పురత్రయం అంటే స్థూల శరీరం ఇనుపపురం. సూక్ష్మశరీరం వెండిపురం, కారణ శరీరం బంగారు పురం. అక్కడ

త్రిపురాసుర సంహారంలో భగవంతుడు బాణం వేస్తే ఆ త్రిపురాలు సంహరింపబడ్డాయి. ఇక్కడ సాధకుడు తన సాధనా బలంతో స్వయంగా సంహరించుకోవాలి జీవభావాన్ని, అప్పుడే పరమాత్మలో లయం అవుతాడు.

ఈ విశ్వానికి ఆధారం పరమాత్మే. పంచభూతాల నుండి ఈ జగత్తు వచ్చినది. వీటికి ఆధారం పంచతన్మాత్రలు, దానికి ఆధారం మాయ. "ఏ తస్మాజాయతే ప్రాణః" ప్రాణం పంచభూతాల యొక్క సూక్ష్మతత్త్వమే!. ప్రాణం ద్వారా ఆయన వ్యక్తం అవుతున్నాడు, కాని ప్రాణం పరమాత్మ కాదు. చైతన్యానికి అత్యంత సన్నిహితంగా వున్నది ప్రాణం. మాయ ద్వారా ఇక్కడ పరమాత్మ వ్యక్తం అవుతున్నాడు. ఏది పరబ్రహ్మమో, ఏది సర్వమందు ఆత్మగా ఉందో, ఏది విశ్వమునకు మహత్తరమైన ఆధారమో, ఏది సూక్ష్మము కంటే సూక్ష్మమో, ఏది నిత్యమో అది నీవు. నీవే అది.

"తత్ త్వమేవ, త్వమేవ తత్". జగత్తులో మానవుడు తాను ఒక భాగం అనుకున్నప్పుడు వ్యష్టి నుండి సమిష్టికి ఎదుగుతాడు. ఈ విధంగా వ్యక్తిగత స్వార్థాన్ని వదలి సమిష్టికి ఎదిగినప్పుడు సగం సాధన పూర్తి అయ్యినట్లు 'భావగ్రాహి జనార్దనః' భగవంతుడు మనలో వున్న భావాన్ని గ్రహిస్తాడు. దివ్యజనని శారదాదేవి భగవంతుడ్ని ఈ విధంగానే ప్రార్థించేదట. "భగవంతుడా! చంద్రుడిలో కూడ మచ్చ వున్నది, కాని నా మనసులో మాత్రం ఎప్పుడూ మలినం వుండకూడదు". ఆమె ఒకసారి స్వామి వివేకానందుడికి, ఒక గజదొంగకు ప్రక్కప్రక్కనే కూర్చుండబెట్టి భోజనం పెట్టినదట. వివేకానందుడు ఇది ఏమిటి అని ప్రశ్నిస్తే, "నాయనా! నన్ను అమ్మా అంటూ ఆశ్రయం కోరాడు. ఇప్పుడు నీకు అతడికి తేడా ఏమి లేదనిపిస్తోంది" అన్నదట. మానవ స్వభావాన్ని ఎవ్వరూ మార్చలేరు. కాకపోతే మనం మారకుండా వుండడం కోసమే ఇంత కష్ట పడతాము. ఈ ప్రపంచంలో Which you cann't change, enduer it. నీవు దేన్నైతే మార్చలేవో దాన్ని భరించు. దేన్నైతే మార్చగలవో దాన్ని మార్చడానికి ధైర్యం, శక్తిని ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థించు.

మూడు అవస్థలలోను భోగ్యం, భోక్తా, భోగరూపంలో ఏదైతే ఉందో దాని నుండి నేను విలక్షణుడను, సాక్షిని, చిత్ స్వరూపుడను, సదా శివుడను అని భావించవలెను. నా యందే సర్వము జనించి, ప్రతిష్ఠితమై, లయము అవుచున్నవి. నేను అద్వయమైన ఆ బ్రహ్మను! నేను అణువు కంటే అణువును, మహత్తు కంటే మహత్తును, విచిత్రమైన ఈ విశ్వము నేను. నేను పురాతన పురుషుడను, నేను ఈశ్వరుడను, హిరణ్మయ రూపుడను, శివ రూపుడను నాకు పాణిపాదములు లేవు. నా శక్తి అచింత్యము, నేత్రములు లేకుండా చూచుచున్నాను. చెవి లేకుండా వింటున్నాను. సమస్తమును తెలుసుకొంటున్నాను. నన్ను తెలుసుకొనేవాడు లేడు. నేను సదా చైతన్య రూపుడను. సమస్త వేదములచేత తెలియబడువాడను నేనే.



వేదాంతములైన ఉపనిషత్తులు తెలియజెప్పినవాడను నేనే. వేద విదుడను నేనే. నాకు పుణ్యపాపములు లేవు. నాశనము లేదు, జన్మ లేదు, దేహేంద్రియ మనోభావము లేదు. నాకు పంచభూతములు లేవు. నిష్కళుడను, అద్వితీయుడను, సర్వసాక్షియు, సదస ద్రహితుడును అగు పరమాత్మ యొక్క స్వరూపము నెఱిగి, ఆ శుద్ధమగు పరమాత్మ రూపమునే పొందుచున్నాడు.

చివరికి వేదాంతం చెప్పేది ఆ పరమాత్మ అంశతోనే ఈ జీవుడు వుద్భవించినాడు. ప్రయత్నపూర్వకంగా సాధన చేసి మరలా ఆ పరమాత్ముడిని చేరడమే జీవుడి యొక్క లక్ష్యం. పరమాత్మతత్త్వాన్ని ఎవరైతే ఈ విధంగా తెలుసుకుంటాడో అతడు శుద్ధమైన ఆ పరమాత్మ రూపాన్ని చేరుకుంటాడు. పరమాత్మ స్వరూపమును పొందుచున్నాడు అనేది స్వప్నము చూచువాడు మేల్కొనుట వంటిది.

# నిరాడంబరమైన ఆదర్శయోగి

**బ్రహ్మోలీన పూజ్యశ్రీ బ్రహ్మానంద తీర్థ స్వాములవారు**

**(శ్రీ సత్యానందాశ్రమం, ఇనుమగుడు, నెల్లూరు జిల్లా)**

సన్యాస ధర్మాన్ని తూచ తప్పకుండా అనుసరించిన మహాయోగి సంపన్నులు. వీరికి పూజ్య ఓంకార స్వామీజీ వారితోను, శాంత్యాశ్రమంతోను చాలా సన్నిహిత సంబంధములు ఉండెడిది. వారు పలుమార్లు శాంత్యాశ్రమంలో వారి దివ్య సందేశాలను అందించెడివారు.

వారిని ఆశ్రమ కార్యక్రమాలకు ఆహ్వానించినప్పుడు, స్వామీజీ! మీరు ఎప్పుడు వస్తారో చెబితే, మీకు ఆ సమయానికి తగిన ఏర్పాటు చేస్తాము అంటే, అమ్మా ! నాకు ఏ ఏర్పాటు వద్దు, నా అంతట నేను వస్తాను అని, ఒక చిన్న సంచితో పాటు వచ్చి ఎంతో నిరాడంబరంగా కార్యక్రమములో పాల్గొనడము జరిగినది. శరీరము సహకరించే వరకు ఎవ్వరికి ఏ శ్రమ కలిగించకూడదు అనేవారు. వారి ఆదర్శ జీవనమును చూచి ఆశ్చర్యము కలిగేది. సన్యాస ధర్మానికి, ఆదర్శవంతమైన జీవనానికి వారు ప్రతీక. తేది. 26-06-2017న వారు పరమపదించిరి. వారు భౌతికంగా లేకపోవడము ఆశ్రమానికి తీరని లోటు. వారు భౌతికముగా లేకపోయినప్పటికి సర్వవేళల వారి శక్తి పని చేస్తూనే ఉంటుంది.

**- జ్ఞానేశ్వరి మాతాజీ**

# శ్రీరామ గీత

**- వినతి**

**పవిత్రమైన బుద్ధి ధ్యానానికి సహకరిస్తుంది.**

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే ।**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥**

అంటే రామ నామాన్ని చెప్పడం మూలంగా విష్ణు సహస్రనామాల్ని చదవకపోయినా అంతటి ఫలితం లభిస్తుంది అని పద్మ పురాణంలో చెబుతారు. సంఖ్యాశాస్త్రం ప్రకారం వర్ణమాలలో "రా" అనే అక్షరం 2వ స్థానంలోను, "మ" అనే అక్షరం 5వ స్థానంలోను వుంది. రామ అంటే $2 \times 5 = 10$. దాన్ని అలాగే 3సార్లు చెబితే $10 \times 10 \times 10 = 1000$ సహస్ర నామాలకు సమానం అవుతుంది. అందుకే పరమశివుడు ఎప్పుడూ రామనామాన్ని చెబుతూ వుంటాడు. భగవత్‌గీత, శివ గీత, అవధూత గీత అని ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు ఇక్కడ మనం రామగీత గురించి తెలుసుకుంటాము. లక్ష్మణుడికి పరిపక్వ దశలో రాముడు బోధించినదే రామగీత.

వాల్మీకి రామాయణం 24,000 శ్లోకాలలో వుంది. అధ్యాత్మ రామాయణం బ్రహ్మాండ పురాణంలో వుంది. రామగీత ఇందులో నుండే వచ్చెను. నారద మహర్షి సత్యలోకంలో బ్రహ్మను దర్శించి ప్రశ్నించాడు. "కలియుగంలో మానవులు అల్ప ఆయుష్కులు, మంద బుద్ధులు, అనేక రోగములతో బాధపడుతున్నారు. అసూయ, ధనము నందు ఆసక్తి కలవాళ్ళు. విద్యను కూడ ధనార్జన కోసమే అభ్యసిస్తారు. వేదాధ్యయనం కూడ ధనాసక్తితోనే చేస్తారు. ఇలాంటి మానవులకు సద్గతి కలగాలంటే ఏ విధమైన ఉపాయం ఉంది?". పూర్వం పరమశివుడు పార్వతీ దేవికి అధ్యాత్మ రామాయణం బోధించాడు. అది ఇప్పుడు నేను నీకు బోధిస్తాను అని అన్నాడు బ్రహ్మ దేవుడు. అధ్యాత్మ రామాయణం బ్రహ్మదేవుడికి, నారదుడికి సంవాద రూపంలో చెప్పాడు. ఒకసారి పార్వతీదేవి శివుడితో ప్రశ్నిస్తుంది. రాముడు పరంధాముడు అయ్యి వుండి కూడ ఈ లోకంలో సాధారణ మానవుడిలాగ సీత కోసం ఎందుకు అంత విలపిస్తున్నాడు? అప్పుడు మహాదేవుడు రాముడి యొక్క తత్త్వాన్ని ఈ అధ్యాత్మ రామాయణం ద్వారా లోకానికి అందించాడు.



వాల్మీకి రామాయణంలో సాక్షాత్ వేదవేద్యుడైన విష్ణువే రాముడిగా అవతరించాడు. కాని విష్ణురూపాన్ని, నారాయణ తత్త్వాన్ని బహిర్గతం కాకుండా చాలా జాగ్రత్తగా కాపాడుకోవాల్సి వచ్చినది. విశ్వామిత్రుడు వంటి కొంతమంది ఋషులకు నిజమైన తత్త్వం తెలిసెను. చివరిలో కైకేయికి కూడ తెలియవచ్చెను. అన్నిచోట్ల రాముడు పరంధాముడుగా కనబడకుండా మానవ రూపంలో ఆయన సంచరించాడు. ఆ తర్వాత ద్వాపర యుగంలో రాముడే కృష్ణుడిగా అవతరించి లీలామానుష చర్యలు అన్నీ చేస్తూ చూపించారు. ఈ కలియుగ మానవుడు 24,000 వేల శ్లోకాల వాల్మీకి రామాయణం చదువుట కష్టమని గ్రహించి, వ్యాసులవారు రాముని అద్వైత తత్త్వాన్ని కలియుగ మానవుల కోసం భాగవతంలో నవమ స్కంధంలో రాముడి తత్త్వాన్ని వ్రాశారు. అలా కొన్ని పురాణాలలో కూడ రాముడి తత్త్వం వ్రాయబడి వున్నది. అయినప్పటికి వ్యాసులవారు రామ చరిత్రను ఆయన మానవుడు కాదు అని నిరూపించడానికి, ఆయన భగవత్ తత్త్వాన్ని తెలియజేయడానికి అధ్యాత్మ రామాయణంలో కృషి చేశారు. ఇక్కడ ఆ పరమాత్ముడు అద్వైత రూపంలో అధ్యాత్మమైన జ్ఞానం ఇవ్వడానికి అవతరించారు. అయితే ఇక్కడ రాముని తత్త్వం పరమశివుడికి పూర్తిగా తెలుసు, పార్వతీ దేవికి సగం తెలుసు. కాని వ్యాసుల వారికి కొంచెం మాత్రమే తెలుసు అని అన్నారట. మరి ఇక మన విషయానికొస్తే అసలు ఏమి తెలియదనే చెప్పాలి.

రాముడి తత్త్వం ఎన్నిసార్లు విన్నా, చదివినా అర్థం గ్రహించడం చాలా కష్ట సాధ్యమైనది. అధ్యాత్మ రామాయణంలో రెండు ఆణిముత్యాలు వున్నాయి. 1) రామ హృదయం, 2) రామ గీత. ఆధ్యాత్మ రామాయణం అధ్యయనం చేయగా కలిగే ఫలితం ఏమిటి అంటే అక్షయ ఫలం లభిస్తుంది. సాలగ్రామం, తులసి చెట్టు, రావి వృక్షం, పవిత్రమైన నదీతీర ప్రదేశం, మహాత్ములు తపస్సు చేసిన స్థలము, అధ్యయనానికి అనుకూలమైన ప్రదేశం, మంచి ఫలితం లభిస్తుంది. అంతేకాదు ఏకాదశినాడు ఉపవాసం చేసి ద్వాదశినాడు అగస్త్య వృక్షం క్రింద పారాయణం చేస్తే విశేష ఫలితం వుంటుంది. పితృదేవతలకు తర్పనాది కర్మలు అన్నీ చేసి రామగీతను అధ్యయనం చేస్తే పితృదేవతలకు కూడ మంచి ఫలితాన్ని ఇస్తుంది.

వాల్మీకి రామాయణంలో సీత ఒక అదర్శవంతమైన స్త్రీ, పతివ్రత అని మాత్రమే చెబుతారు, కానీ అధ్యాత్మ రామాయణంలో సీతాదేవి అంటే సృష్టి, స్థితి, సంహారము అయిన మూల ప్రకృతి. శ్రీరాముడు హనుమంతుడికి సీత ద్వారా తత్త్వాన్ని తెలియజేయడం జరిగినది. తర్వాత తత్త్వమసి మహావాక్యాన్ని రాముడు బోధిస్తాడు. ఆమె యొక్క కనురెప్ప మూసి తెరిచే లోపల సృష్టి స్థితి లయలు జరుగుతున్నాయట. ఇక్కడ మన కాలమానము భగవంతుడి కాలమానానికి వున్న తేడా తెలియబడుతోంది. తులసీరామ్‌దాస్ కూడ సీతమ్మ మూల ప్రకృతి అని, ఆమె సమస్త క్లేశహారిణి, సుఖప్రదాయని అని వర్ణిస్తాడు. శ్రీరాముడు సాక్షాత్ పరబ్రహ్మ

స్వరూపం. అహల్య శాప విమోచనం తర్వాత ఆమె గుర్తిస్తుంది, రాముడు మానవ రూపంలో వచ్చిన పరంధాముడు అని. అలాగే వామదేవుడు అనే ఋషి కూడ చెబుతాడు, "రాముడు పరంధాముడు, సీతమ్మ ప్రకృతి, లక్ష్మణుడు ఆదిశేషుడు, అందువలన వారు అడవులకు ఏగుచున్నారు అని దుఃఖించవద్దు. వారు కేవలం మానవ మాత్రులు కారు".

శ్రీరాముడు, సచ్చిదానంద స్వరూపం. సాధకుడు ప్రారంభంలో పారాయణం, పూజలు చేయుటవలన బుద్ధి పవిత్రం అవుతుంది. ఆ తర్వాత పవిత్రమైన ఆ బుద్ధి ధ్యానానికి సహకరిస్తుంది. సాధకుడికి వాసనలు క్షయం కాకుండా సమాధి స్థితి సాధ్యం కాదు. పూర్వం అధ్యాత్మ రామాయణం కీర్తనల రూపంలో స్త్రీలు కూడ పాడేవారు. సీతాదేవిని రాముడు అడవిలో వదిలేశాడు అంటాము సాధారణంగా, కానీ వదిలివేయలేదు. ఆయన పరిత్యజించి నాడు సీతమ్మను. పరిత్యజించడం అంటే తనకు ఇష్టమైన దాన్ని విడిచిపెట్టాడు. దాన్నే త్యాగము అంటారు. అగ్ని ప్రవేశం తర్వాత సీతాదేవిని అయోధ్యకు తీసుకొనివస్తాడు రాముడు. తర్వాత గూఢాచారుల మాట వలన సీతాదేవిని వాల్మీకి మహర్షి ఆశ్రమ సమీపంలో వదలివేస్తారు. తర్వాత సీతమ్మ వనంలో ఎలా వుందో అలాగే రాముడు చక్రవర్తి అయ్యి వుండి కూడ రాజర్షిలాగ జీవనం సాగించాడు. సీతా పరిత్యాగం తర్వాత రాముడు ఎలా జీవించాడు అనేది లక్ష్మణుడికి ఉపదేశిస్తాడు అదే రామగీత. అన్ని ఉపనిషత్తుల సారాంశం.

రఘువంశం - ఇక్ష్వాకు వంశస్తులంతా రాజర్షులే !. ఈ వంశస్తులు రాజ్యాల్ని పరిపాలించిన తర్వాత, యోగ్యత పొందిన యువరాజులకు రాజ్యాన్ని అప్పగించి, అరణ్యాలకు వెళ్ళి జపతపాదులతో సాధనలు చేసుకుంటూ వుండేవారు. ఉదా॥ దిలీపుడు, రఘుమహారాజు. అలాగే శ్రీరామచంద్రుడు కూడ సీతా పరిత్యాగం తర్వాత జపతపాదులలో గడపసాగాడు. లక్ష్మణుడు 14 సం॥ రామ సేవలో ఉన్నాడు. అంటే దశేంద్రియాలు, 4 అంతఃకరణాలు పూర్తిగా పవిత్రతను సంతరించుకున్నాయి. అందుకే రాముడు లక్ష్మణుడికి బోధ చేస్తున్నాడు. ముందు రాముడు లక్ష్మణుడికి నృగుమహారాజు చరిత్ర చెబుతాడు, ప్రారబ్ధ కర్మ వలన బ్రాహ్మణుడి శాపంతో ఊసరవెల్లిగా జన్మించవలసి వచ్చినది అని ఉపమానంగా చెబుతూ తనకు భార్యావియోగము అనుభవించాల్సి వుంది, అందుకే సీతా పరిత్యాగము జరిగెను అనెను.

> ఆధ్యాత్మిక నియమం ప్రకారం ధ్యానానంతర సత్ఫలితాలు నిలుపుకోగలిగి, గట్టి పరీక్షా సమయాల్లో కూడ తన ఆంతరిక శాంతిని, ఆనందాన్ని పోగొట్టుకోకుండా నిలుపుకోగలిగిన సాధకుడు మరణానంతరము ఆ పరమాత్ముని మహాశాంతిలో మిళితమవుతాడు.
> *- శ్రీ పరమహంస యోగానంద*



# అహల్యాబాయి

*- సిలువేరు సుదర్శన్*

## ప్రజాక్షేమమునకై త్యాగము చేసిన వీరనారి అహల్యాబాయి

భారతదేశంలో భర్త మరణించిన స్త్రీ సహగమనమైనా చెయ్యాలి, లేదా జీవచ్ఛవంలా బతకాలి అన్న అపప్రద జన ప్రచారంలో వుంది. భర్త మరణానంతరం కుమారుని తరపున రాజ్యమేలిన మహారాణులెందరో వున్నారు. అది ధర్మ సమ్మతమే, మహాభారత యుద్ధానంతరం కాశ్మీర రాజ్యాన్ని పుత్రుడైన గోనందుని పక్షాన యశోవతి పరిపాలించింది. శ్రీకృష్ణుని నిర్ణయమే యశోవతిగా రాజ్యమేలడం. ఆ విధంగా రాజ్యమేలిన స్త్రీలలో మొదటగా గుర్తు వచ్చేది ఝాన్సీ లక్ష్మీబాయి. బ్రిటీషువారిపై పోరాడుతూ వీరమరణం పొందిన ఆమె ప్రసిద్ధురాలు. మహారాష్ట్ర రాణులలో చెప్పుకోదగ్గ మరొకపేరు అహల్యాబాయిది. ఆమె పరిపాలనలో అక్కడక్కడ యుద్ధాలు జరిగినప్పటికీ ఎక్కువగా శాంతి పరిస్థితులే ఉండడం వల్ల ఆమె ప్రజల సంక్షేమానికి పాటు పడగలిగింది.

అహల్యాబాయి జన్మించింది ఒక సాధారణమైన కుటుంబంలో. ఆమె తండ్రి చౌండీ అనే చిన్న గ్రామానికి అధికారి మాత్రమే. ఆ రోజులలో ఆడపిల్లలను గురుకులాలకు పంపే సాంప్రదాయం లేదు. కానీ తండ్రి అహల్యకు ఇంట్లోనే చదవడం నేర్పించాడు. మాళవ ప్రాంతపు రాజైన మల్హర్‌రావు హోల్కార్ పూనాలోని పేష్వా దర్శనానికి వెళుతూ యాదృచ్ఛికంగా చౌండీ గ్రామంలో మజిలీ చేశాడు. దేవాలయంలో భగవత్సేవలో నిమగ్నమైన అహల్యాబాయి సౌశీల్యము ఆయన దృష్టిని ఆకర్షించింది. పది సంవత్సరాల వయస్సున్న తన కుమారుడు ఖండేరావుకి ఎనిమిదేళ్ళ ఆ అమ్మాయి తగిన భార్య అని ఆయన నిర్ణయించాడు. 1733వ సంవత్సరంలో వివాహం జరిగింది.

సాధారణ గ్రామాధికారి కుమార్తె మహారాణి అవడమంటే అదృష్ట లక్ష్మీ వరించిందనే చెప్పాలి. కాని 1754లో అహల్యాబాయికి ముప్పై ఏళ్ళయినా నిండకముందే ఖండేరావు వీర మరణం పొందాడు. మామగారు ఆమెను సహగమనం చెయ్యనివ్వలేదు. హోల్కార్ వంశాన్ని, మాళవ రాజ్యాన్ని కాపాడవలసిన బాధ్యత ఆమెదేనని చెప్పాడు. రాజ్యపాలనలో సైన్య నిర్వహణలో ఆమెకు తర్ఫీదునిచ్చాడు. అనేక సందర్భాలలో అహల్యాబాయి స్వయంగా సైన్యాన్ని కదిలించుకుంటూ వెళ్ళేది.

1767లో మామగారి మరణానంతరం కుమారుడైన మాలేరావుని సింహాసనంపై అభిషిక్తుణ్ణి చేసి అహల్యాబాయి పరిపాలన సాగించింది. కాని దురదృష్టం ఆమెను వదలలేదు. ఏడాది తిరగకుండానే మాలేరావు మరణించాడు. నిండు యవ్వనంలో భర్తా, వార్ధక్యం రాకమునుపే పుత్రుడూ మరణించినా, అహల్యబాయి ధైర్యాన్ని కోల్పోలేదు. మాళవ రాజ్య ప్రజలే తమ పిల్లలనుకుంది. వారి సంక్షేమమే తన జీవిత లక్ష్యమనుకుంది.

ఇండోర్ రాజధానిగా ఉన్న మాళవ రాజ్యం పేష్వా పలుకుబడిలోనిది. అహల్యాబాయి తనకు పాలనా పగ్గాలు చేపట్టే అవకాశమివ్వమని పేష్వాకు అర్జీ పెట్టుకుంది. రాజ్యంలో కొందరు స్త్రీ పరిపాలన చెయ్యడానికి లేదని ఎదురుతిరిగారు. సైన్యంలో చాలామంది ఆమె రాణి కావాలని కోరుకున్నారు. ఏనుగు మీద హోదాపై నాలుగు విల్లులతో లెక్కలేనన్ని బాణాలతో అహల్యాబాయి కూర్చుని సైన్యాన్ని నడిపి తిరుగుబాటును అణచివేసింది. పేష్వా ఆమెకు అధికారాన్ని ఇస్తూ ఫర్మానా పంపించాడు. మామగారు మల్హార్‌రావు దత్తపుత్రుడైన తుక్కోజి హోల్కర్ సహాయంతో ఆమె పరిపాలన సాగించింది. ఏనాడు పరదా పద్ధతిని పాటించకుండా ప్రతిరోజు ప్రజలకు దర్శనమిస్తూ వారి కష్టాలను తీరుస్తూ సుమారుగా ముప్పై ఏళ్ళు పరిపాలించిన మహోత్తమురాలు మహారాణి అహల్యాబాయి. ప్రజల కోసమే జీవించిందనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. ఒక పిల్లవాడి దత్తత వ్యవహారంలో ఆమెవద్ద ఉన్న మంత్రి లంచాన్ని ఆశించాడు. విషయం తెలసిన మహారాణి స్వయంగా దత్తత స్వీకార ఉత్సవాన్ని జరిపించి పిల్లవాడికి వస్త్రాభరణాలను ఇచ్చింది. గిరిజనులైన భిల్లులూ, గోండులూ రాజ్యం సరిహద్దులలో దోచుకుంటూ ఉండేవారు. వారిని సామంతో జయించాలనుకుని ఆమె కొండ ప్రాంతాలను వారికి హక్కు భుక్తంగా ఇచ్చి కొండల గుండా వెళ్ళేవారి నుంచి స్వల్పంగా సుంకం వసూలు చేసుకోనిచ్చింది. మహారాణి పలుకుబడిలో ముఖ్యమైనది ఇండోర్ (ఇందూరు) నగర నిర్మాణం. అంతకు ముందు చిన్న పల్లెగా ఉండే ఇండోర్‌లో కోటలూ, బాటలూ నిర్మించి పెద్ద పట్టణముగా మార్చింది. రాజ్యమంతటా మార్గాలను ఏర్పాటు చేసి, దేవాలయాలలో పూజలు నిర్వహించేలా దానాలను ఇచ్చింది. దేవాలయాల పునరుద్ధరణనూ, కోట నిర్మాణాన్ని తన రాజ్యానికే పరిమితం చేయలేదు. కాశీ, గయ, అయోధ్య, మధుర, కంచి, ద్వారక, సోమనాథ్ మొదలైన అనేక పుణ్యస్థలాలలో ఆమె చేసిన దైవ కార్యాలనూ, ధర్మకార్యాలను మనం చూడవచ్చును. భారతదేశ చరిత్రలో అనేకమంది రాణులున్నారు. వారిలో చాలామంది యుద్ధాలలో పాల్గొని వీరమరణం పొందినవారే. బ్రిటీష్ వారిపై యుద్ధం చేసిన ఝాన్సీ లక్ష్మీబాయి, చిత్తూరు రాణి చెన్నమ్మల గూర్చి తెలిసినంతగా రాణీ అహల్యాబాయి గూర్చి తెలియదు. ఇండోర్ విమానాశ్రయానికి ఆమె పేరు పెట్టడం, ఆమె పేరున అవార్డు నెలకొల్పడం వంటివి కొన్ని జరిగినమాట వాస్తవమే. కానీ, జన సామాన్యంలో అంత ప్రచారం రాలేదు. శాంతి సమయంలో ప్రజాసంక్షేమానికి పాటుపడిన మహారాణిగా ఆమెను నిత్యం జ్ఞాపకముంచుకోవడం అభిలషణీయం.



విజ్ఞప్తి !

# గోశాల పునర్నిర్మాణము

**ఓం నమో భగవతే ఓంకారాయ**
**ఓం నమో భగవతే వాసుదేవాయ**
**ఓం శ్రీ గోమాత్రే నమః**

దివ్యాత్మ స్వరూపులకు ప్రణామములు. పూజ్య ఓంకారస్వామి స్థాపించిన గోశాలలో గోవులు – 25, దూడలు – 30, గిత్తలు – 7, దినాభివృద్ధి గావింపబడుతున్నాయి. గోఘృతంతో నిత్యం ప్రణవ హోమం నిర్వహించబడుచున్నది. గురుకుల బాలబాలికలకు, ఆశ్రమ వాసులకు గోక్షీరము వినియోగింపబడుచున్నది. గోమాతలు వశించు గోశాల శిథిలావస్థకు వచ్చినది. పూజ్య స్వామీజీ వారి ఆశీస్సులతో గోశాల పునర్నిర్మాణము చేయుటకు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు సంకల్పించిరి. గోమాతలు నివశించుటకు 5 షెడ్డులు అవసరమున్నవి. ఒక షెడ్డు నిర్మాణమునకు సుమారు రూ॥ 5,00,000/– (ఐదు లక్షలు) ఖర్చు అగునని నిర్ధారణ చేయబడినది.

రూ॥ 10,000/– (పదివేలకు) పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఒక రోజునకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 150/–. ఒక నెలకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 4,500/– అగును. వారి వారి శక్తి అనుసారము గ్రాసమునకు దాతలు సహకరించవలసినదిగా మా విన్నపము. గోగ్రాసమునకు సమర్పించిన దాతల నామ గోత్రములతో, గోవులకు గ్రాసము అందించబడును. ఒక గోవునకు సమర్పించిన గ్రాసము 10 అశ్వమేధ యాగములకు సమానము అని గోమహత్యంలో చెప్పబడినది.

ఆశ్రమ శ్రేయోభిలాషులు, గోమహత్యం పట్ల విశ్వాసం ఉన్న వాళ్ళు గోశాల పునర్నిర్మాణము మరియు గోగ్రాసము కొరకు ధన రూపంలో లేదా డి.డి. గాని, చెక్కు గాని శ్రీ శాంతి ఆశ్రమం పేరున విరాళము పంపగలరని విజ్ఞప్తి. మీ విరాళమునకు 80జి ప్రకారము ఇన్‌కంటాక్సు మినహాయింపు కలదు.

**ఓం తత్‌సత్**

గురుసేవలో
*– వినమ్రానంద సరస్వతి*

## శాశ్వత అన్నదాన పథకము

| | | |
|---|---|---|
| 1. | రూ. 5,000-00 | శ్రీ కె. నాగభూషణ ఆచారి గారు, విశాఖపట్నం కీ॥శే॥ దుద్దుపూడి సాంబమూర్తి గారి భార్య కీ॥శే॥ దుద్దుపూడి అన్నపూర్ణమ్మ గారి ఆత్మశాంతి కోరుతూ... |
| 2. | రూ. 10,001-00 | శ్రీ సత్యనారాయణ పొన్నగంటి గారు, బెంగుళూరు, వీరి పెద్ద కుమారుడు చి॥ మదూస్ పుట్టిన రోజు సందర్భముగా |
| 3. | రూ. 25,000-00 | శ్రీమతి యండమూరి అంబికాదేవి గారు, కాకినాడ, వీరి పుట్టిన రోజు సందర్భముగా అన్నదానం |
| 4. | రూ. 5,500-00 | శ్రీమతి ఎన్. స్వరాజ్యలక్ష్మి గారు, హైదరాబాద్, పూజ్య స్వామిజీ జన్మదినం రోజున అన్నదానం |
| 5. | రూ. 10,000-00 | శ్రీమతి కొండా చిన్న పార్వతి గారు, శ్రీ శాంతి ఆశ్రమము, వీరి ఆయురారోగ్యములు కోరుతూ అన్నదానం |
| 6. | రూ. 25,000-00 | శ్రీమతి దాట్ల బంగారమ్మ గారు, శ్రీ శాంతి ఆశ్రమం, వీరి ఆయురారోగ్యములు కోరుతూ అన్నదానం |
| 7. | రూ. 20,000-00 | శ్రీమతి రాయపురెడ్డి అనూష గారు (శ్రీ గోపు తాతమ్మ గారి మనుమరాలు) W/o. శ్రీ రాయపురెడ్డి ఉదయ్ తేజ్ గారు,U.S.A., వీరి పెండ్లిరోజు సందర్భముగా |
| 8. | రూ. 6,000-00 | శ్రీ ఎమ్.ఎన్. ఆదిత్య గారు, విశాఖపట్నం, వీరి తండ్రి గారు కీ॥శే॥ జగన్నాధరావు గారి జ్ఞాపకార్థం, ఆత్మశాంతి కోరుతూ (రోజూ అన్నదానం) |
| 9. | రూ. 2,000-00 | శ్రీ పి.వి.వి. భగవాన్ గారు, శాంతి ఆశ్రమం (Elementary School H.M) వీరి తండ్రిగారు సంస్మరణ దినము నిమిత్తం అన్నదానం |
| 10. | రూ. 5,000-00 | శ్రీ డి.వి.ఆర్. ఆంజనేయులు గారు, విశాఖపట్నం & వై.వి.జి.యస్. రాజు గారు & శ్రీమతి జ్యోతి గార్ల కుమారుడు చి॥ యర్రంశెట్టి సాయిచరణ్ & చి॥ల॥సౌ॥ అనూషా గార్ల పెండ్లిరోజు సందర్భముగా అన్నదానం |
| 11. | రూ. 5,000-00 | శ్రీ దాకమూరి నగేష్ గారు & ఫ్యామిలీ మెంబర్స్, U.S.A వీరి తండ్రిగారు 80వ జన్మదినం సందర్భముగా |
| 12. | రూ. 3,500-00 | శ్రీ ఎన్. రవికుమార్ వర్మ గారు, C/o. శ్రీ మూర్తి రాజు గారు, గుమ్మంపాడు వీరి అన్నగారు కీ॥శే॥ హరికృష్ణ గారి వర్ధంతి సందర్భముగా అన్నదానం |

## దిగువ ప్రార్థనా మందిరము

| | | |
|---|---|---|
| 1. | రూ. 7,000-00 | శ్రీ డి. రామకృష్ణ గారు, కాకినాడ. |
| 2. | రూ. 7,000-00 | శ్రీ సి.హెచ్. రఘురామ్ గారు, హైదరాబాద్ |
| 3. | రూ. 8,000-00 | శ్రీ కె. ఉమామహేశ్వరరావు గారు, హైదరాబాద్ |

## రిసెప్షన్

| | | |
|---|---|---|
| 1. | రూ. 5,000-00 | ప్రొఫెసర్ ఎ.ఎమ్. శర్మ గారు & శివానంద మాతాజీ గార్లు, ముంబాయ్ |
| 2. | రూ. 5,000-00 | శ్రీమతి సంకా విజయలక్ష్మి గారు, బెంగుళూరు. |



## పూజలు - పండుగలు

| | | |
|---|---|---|
| 1. | రూ. 2,000-00 | శ్రీ పి.వి.వి. భగవాన్ గారు, శాంతి ఆశ్రమం, (Elementary School H.M) |
| 2. | రూ 2,000-00 | శ్రీమతి & శ్రీ గరిమెళ్ళ రేణుక శ్రీనివాస్ గారు, హైదరాబాద్, అఖండ దీపారాధన నిమిత్తం |
| 3. | రూ. 24,012-00 | గురుపౌర్ణమి సందర్భముగా ఆశ్రమ శ్రేయోభిలాషులు, ఆశ్రమ వాసులు, పూజ్యమాతాజీ వార్కి సమర్పించిన కానుకలు |

## పిల్లల సంక్షేమము

| | | |
|---|---|---|
| 1. | రూ. 1,000-00 | శ్రీ గౌడు వెంకటరావు గారు, శ్రీ శాంతి ఆశ్రమం |
| 2. | రూ. 2,000-00 | శ్రీ గౌడు వెంకటరావు గారు, శ్రీ శాంతి ఆశ్రమం |
| 3. | రూ. 2,002-00 | శ్రీ వై. ఉదయ్ గారు, హైదరాబాద్, విద్యాఖర్చుల నిమిత్తం |
| 4. | రూ. 30,000-00 | శ్రీమతి జె. ఉషశ్రీ గారు, సికింద్రాబాద్ |

## విరాళములు

| | | |
|---|---|---|
| 1. | రూ. 1,000-00 | శ్రీ నాగవరపు మల్లిబాబు గారు, తుని |
| 2. | రూ. 1,000-00 | శ్రీమతి వానపల్లి నాగసాయి సౌమిత్ర గారు, తిమ్మాపురం |
| 3. | రూ. 1,000-00 | శ్రీ దాకమూరి నగేష్ బాబు గారు, S/o. స్వామి జపానంద గారు, U.S.A |
| 4. | రూ. 1500-00 | శ్రీ గొల్లపల్లి రోహిణి కామేశ్వరి కుమార్ గారు, రాజమండ్రి |
| 5. | రూ. 3,001-00 | శ్రీమతి వై.యస్. కుసుమ గారు, హైదరాబాద్ |
| 6. | రూ. 1501-00 | శ్రీమతి కె. కాత్యాయణి గారు, హైదరాబాద్ |
| 7. | రూ. 1,000-00 | శ్రీ దేవీ హేమభూషణం గారు, న్యూ గుమ్మిడి పూండి (తమిళనాడు) |
| 8. | రూ. 1,000-00 | శ్రీ లక్ష్మి మహాదేవన్ గారు, ఆనంద్రాశ్రమం |
| 9. | రూ. 2,500-00 | శ్రీ కె. సుబ్రహ్మణ్యం గారు, విశాఖపట్నం |
| 10. | రూ. 4,000-00 | శ్రీ పి. రఘు మురళి గారు, బూచిపల్లి (హైదరాబాద్) |
| 11. | రూ. 4,000-00 | శ్రీ ఆదూరి సూర్యనారాయణ గారు, బూచిపల్లి, (హైదరాబాద్) |

## గో సంరక్షణ (గో గ్రాసం)

| | | |
|---|---|---|
| 1. | రూ. 10,000-00 | శ్రీ కె. నాగభూషణ ఆచారి గారు, విశాఖపట్నం, కీ॥శే॥ దుద్దుపూడి సాంబమూర్తి గారి ఆత్మశాంతి కోరుతూ. |
| 2. | రూ. 4,000-00 | శ్రీ కె.వి. సుబ్బారావు గారు, సికింద్రాబాద్, వీరి భార్య లక్ష్మిపూర్ణిమ గారి పేరున |
| 3. | రూ. 1,116-00 | శ్రీ భాగవతుల సూర్యసంగమేశ్వరరవు గారు, రాజమండ్రి. |
| 4. | రూ. 2,011-00 | శ్రీ నరేష్ పొన్నగంటి, S/o. సత్యనారాయణ పొన్నగంటి గారు (బెంగుళూరు) వీరి ఆయురారోగ్యభాగ్యములు కోరుతూ. |
| 5. | రూ. 4,500-00 | శ్రీ గణేష్ ఆచార్య గారు & శ్రీమతి రాజేశ్వరి ఆచార్య గార్లు, శ్రీ శాంతి ఆశ్రమం |
| 6. | రూ. 10,000-00 | శ్రీమతి సంకా విజయలక్ష్మి గారు, బెంగుళూరు, వీరి భర్త గారు కీ॥శే॥ సంకా వెంకటేశ్వరరావు గారి సంస్మరణ దినం నిమిత్తం, గోగ్రాసం |